క్రిమినల్‌తో రాజకీయాలు
చేసేటప్పుడు
చాలాజాగ్రత్తగా
ఉండాలి




KADILIMCHE VAARTHA Telugu daily
కదిలించే వార్త
తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

సంపుటి : 10 | సంచిక : 205 | శనివారం 11 ఏప్రిల్ 2026 | పేజీలు 8 | వెల : 05

# గృహ గణనలో ఇప్పటికే 5.72 లక్షల కుటుంబాల సెల్ఫ్ ఎన్యుమరేషన్




- స్మార్ట్‌గా, సౌకర్యవంతంగా లక్షలాది కుటుంబాల స్వీయ గణన
- జనగణన డిజిటల్ సదుపాయాల్లో పెరుగుతున్న ప్రజా భాగస్వామ్యం
- 5.72 లక్షల కుటుంబాల సెల్ఫ్ ఎన్యుమరేషన్ : ఆర్‌జీఐ
- ప్రత్యేక మొబైల్ యాప్ – ప్రతీ కుటుంబానికి 33 ప్రశ్నలు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ వేర్వేరు తేదీల్లో జరగనుంది
- ఆంధ్రప్రదేశ్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ కాలపరిమితి ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30 వరకు ఉంటుంది.



## ఎన్నికల వేళ మోదీ గిమ్మిక్కులు

- నియోజకవర్గాల పునర్విభజనతో పెను ముప్పు: ఖర్గే
- మహిళా రిజర్వేషన్ల అమలులో కుట్ర
- నియోజక వర్గాల పునర్విభజనపై విపక్షాల ఉమ్మడి పోరుకు ఖర్గే పిలుపు

# వచ్చే 6 నెలల్లో.. 10 లక్షల ఎల్పీజీ కనెక్షన్లు ఇవ్వాలి

- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కొనేందుకు మరింత సన్నద్ధతతో పనిచేయాలని ఆదేశం
- పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచన
- రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి**

యుద్ధాల కారణంగా తలెత్తిన ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కొనేందుకు మరింత సన్నద్ధతతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగం పెంచేం దుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు, ఆయిల్ కంపెనీలకు సూచించారు. దీపం పథకం లబ్దిదారులకు పీఎన్జీ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. దీపం పథకం లబ్దిదారులు పీఎన్జీకి మారితే, వారికి దీపం పథకం కింద ఇచ్చే రాయితీ సొమ్మును జమ చేసేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని, దీనిపై వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని ఆదేశించారు. - మిగతా3లో

## పెద్ద కుటుంబాలకు ప్రోత్సాహం

- త్వరలో ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ బిల్లు
- ఏపీలో పెద్ద కుటుంబాలకు ప్రాధాన్యం
- సంస్కరణల అమలుకు నిర్ణయించిన ప్రభుత్వం
- ఐటీ, విద్యాశాఖ మంత్రి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

**అమరావతి**

కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ ప్రయోజనాలను అందించడంతో పాటు పెద్ద కుటుంబాలను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యంగా సంస్కరణలను అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి త్వరలో - మిగతా3లో




## పాకిస్థాన్ గూఢచార మాడ్యూల్ గుట్టురట్టు చేసిన ఢిల్లీ పోలీసులు

- 'సీసీటీవీ'లతో సైనికుల కదలికలపై నిఘా పెట్టిన ఉగ్రముఠా
- పాకిస్థాన్ హ్యాండర్లతో ఉగ్రముఠాకు సంబంధాలు
- 11 మంది అరెస్టు- సాంకేతికతను ఉపయోగించి సైనిక కదలికలపై నిఘా

## మహిళలకు, నిరుద్యోగులకు రూ.3000 ఆర్థిక సాయం

- చొరబాట్లపై ఉక్కుపాదం
- బంగాల్ బీజేపీ మేనిఫెస్టో ఇదే!
- సోనార్ బంగ్లా రోడ్ మ్యాప్
- బంగాల్ ఎన్నికల కోసం 15 అంశాలతో బీజేపీ మేనిఫెస్టో విడుదల




# క్రిమినల్‌తో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి

- మంత్రులకు సీఎం దిశానిర్దేశం
- కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయాలు ప్రమాదకరం
- ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు ప్రచారం చేసే కుట్రలను నిత్యం తిప్పికొట్టాలి
- కేబినెట్ అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై మంత్రులతో చర్చించిన సీఎం చంద్రబాబు
- బెదిరింపు రాజకీయాలను ధీటుగా తిప్పికొట్టాలి

**అమరావతి**

కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయాలు ప్రమాదకరమని సీఎం చంద్రబాబు అన్నారు. నేరగాళ్లతో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. మంత్రివర్గ సమావేశంలో అ జెండా అంశాలు ముగిశాక ఇతర అంశాలపై మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం దాదాపు 3గంటలపాటు సుదీర్ఘంగా సాగింది. కేబినెట్ అజెండా అంశాలు ముగిశాక మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు పలు అంశాలపై చర్చించారు. జలధార, సూర్యఘర్, పీఎం కుసుమ్, పట్టాదారు పాస్ - మిగతా3లో






## రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన నీతీశ్ కుమార్

- నీతీశ్ చేత ప్రమాణస్వీకారం చేపించిన రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్
- హిందీలో ప్రమాణం చేసిన నీతీశ్ కుమార్
- కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్

## ఇంధన భద్రతపై గల్ఫ్ దేశాలతో చర్చలు

- పశ్చిమాసియాలోని పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాం
- దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారు
- భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్

# డ్రగ్స్ రహిత ఏపీ లక్ష్యంగా దండి యాత్ర 2.0



- తిరుపతి నుంచి విశాఖకు 1000 కి.మీల భారీ సైకిల్ ర్యాలీ
- యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు మహా సంకల్పం
- తిరుపతి నుంచి విశాఖపట్నం దాకా వెయ్యి కిలోమీటర్ల ప్రయాణం
- లక్ష మంది విద్యార్థులతో సే నో టు డ్రగ్స్ ప్రతిజ్ఞ

**అమరావతి**

సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్య డ్రగ్స్ (మాదకద్ర వ్యాలు). యువత ఉజ్వల భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్న ఈ మత్తు మహమ్మారిని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్తంగా నడుం బిగించాయి. మత్తు రహిత రాష్ట్రమే (డ్రగ్ ఫ్రీ ఏపీ) లక్ష్యంగా ఒక మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టాయి. ఉప్పుపై పన్నును నిరసిస్తూ నాడు జాతిపిత మహాత్మా గాంధీ చేపట్టిన చారిత్రక - మిగతా3లో

# డ్రగ్స్ రహిత ఏపీ లక్ష్యంగా 'దండి యాత్ర 2.0'

-మొదటిపేజీ తరువాయి

'దండియాత్ర' మనందరికీ తెలుసు. ఇప్పుడు సరిగ్గా అదే స్ఫూర్తితో డ్రగ్స్ వలయాలను ఛేదించేందుకు 'దండి యాత్ర 2.0' పేరుతో తిరుపతిలో భారీ సైకిల్ ర్యాలీ మొదలైంది. బ్రిటీష్ కాలంలో ఉప్పు చట్టాలను వ్యతిరేకిస్తూ గాంధీజీ శబర్మతి ఆశ్రమం నుంచి దండి వరకు సుమారు 390 కిలోమీటర్ల మేర చారిత్రక పాదయాత్ర చేశారు. నాడు పరాయి పాలన నుంచి విముక్తి కలిగించేందుకు ఆ యాత్ర సాగితే, నేడు మత్తు నుంచి యువతను విముక్తి చేసేందుకు 'దండి యాత్ర 2.0' ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగం 'ఈగల్ టీమ్', స్వచ్ఛంద సంస్థ 'వైబ్రెంట్స్ ఆఫ్ కలాం' సంయుక్త ఆధ్వర్యంలో ఈ యాత్రను డిజైన్ చేశారు. ఈ భారీ సైకిల్ యాత్ర తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నుంచి ఉత్సాహం గా ప్రారంభమైంది. ఇక్కడి నుంచి విశాఖపట్నం వరకు ఈ యాత్ర కొనసాగుతుంది. మొత్తం 1000 కిలోమీటర్ల మేర ఈ సుదీర్ఘ ప్రయాణం సాగనుంది. సైకిల్ యాత్ర బృందం ప్రతిరోజూ 60 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తుంది. "డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా దాదాపు 1000 కిలోమీటర్ల వరకు మేము యాత్ర చేస్తున్నాం. మా వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంస్థకు చెందిన ఏడుగురు సభ్యుల బృందం ఈ సైకిల్ యాత్రలో పాల్గొంటోంది. 13 జిల్లాల మీదుగా 25 యూనివర్సిటీలు, కాలేజీలకు వెళ్తాం. దాదాపు లక్ష మంది యువతను ప్రత్యేకంగా కలుసుకుని, వారితో 'సే నో టు డ్రగ్స్' అనే ప్రతిజ్ఞ చేయిస్తూ యాత్రను ముందుకు నడిపిస్తాం. సీఎం చంద్రబాబుని కలిసి ఆయన మార్గదర్శకత్వంలో ఈ యాత్రకు శ్రీకారం చుట్టాం. దీనికి ఐజీ ఆర్కే రవికృష్ణ పూర్తి సహకారాలు అందిస్తున్నారు. ఈరోజు ఎస్వీ యూనివర్శిటీ నుంచి యాత్ర మొదలైంది." – విజయ్ కల్లాం, ఫౌండర్, వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంస్థ



### లక్ష మంది యువతే టార్గెట్

ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం యువత ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావడమే. యాత్ర మొత్తం మీద రాష్ట్రంలోని 13 జిల్లాల గుండా ఈ బృందం ప్రయాణిస్తుంది. ఆయా జిల్లాల్లో దారి పొడవునా ఉన్న సుమారు 25 విశ్వవిద్యాలయాలు (యూనివర్సిటీలు), ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలను వీరు సందర్శిస్తారు. దాదాపు ఒక లక్ష మంది యువతను ప్రత్యక్షంగా కలుసుకుని, వారితో మమేకం అవుతారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఎదురయ్యే అనర్థాల గురించి వివరిస్తారు. డ్రగ్స్ ఉపయోగిస్తే జరిగే నష్టాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ఉద్దేశం. 'డ్రగ్స్ వద్దు – సైకిల్ ముద్దు' అనే నినాదంతో ఈ దండి యాత్ర 2.0 కొనసాగుతుంది. 13 జిల్లాల్లో ఈ యాత్రకు శ్రీకారం చుట్టారు. దీనివల్ల ప్రజలంతా మత్తు పదార్థాల అనర్థాల గురించి తెలుసుకుని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడాలని మేము తెలియజేస్తున్నాం." – తిరుపతి పోలీసులు

### ప్రభుత్వం, పోలీసుల మద్దతు

'డ్రగ్స్ వద్దు సైకిల్ ముద్దు' అనే పవర్‌ఫుల్ నినాదంతో ఈ యాత్ర ముందుకు సాగుతోంది. ఈ బృందానికి రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఈ యాత్ర రూపుదిద్దుకోగా, పోలీసు ఉన్నతాధికారి ఐజీ ఆర్కే రవికృష్ణ దీనికి పూర్తి సహకారాలు అందిస్తున్నారు.

# పెద్ద కుటుంబాలకు ప్రోత్సాహం

-మొదటిపేజీ తరువాయి

ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎఫ్‌బీఎంఎస్) బిల్లును అందుబాటులోకి తీసుకురానుంది. ఇందుకు సంబంధించి (ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) సిఫార్సు చేసేందుకు ఐటీ, విద్యాశాఖ మంత్రి ఛైర్మన్‌గా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో ఆర్థిక, హోం, రెవెన్యూ, పౌరసరఫరాలు, వైద్యఆరోగ్య, జలవనరుల శాఖల మంత్రులు సభ్యులుగా ఉంటారు. అదే విధంగా కన్వీనర్?గా ప్రణాళికాశాఖ ముఖ్యకార్యదర్శి విధులను నిర్వర్తిస్తారు.




### కమిటీ చేయవలసిన పనులివే!

ప్రధానంగా ప్రతిపాదిత ఫ్యామిలీ బెనిఫిట్ కార్డుకు వర్తింపజేసేలా 'కుటుంబం' అనే నిర్వచనాన్ని రూపొందిం చాలి. ఇది ముఖ్యంగా పెద్ద కుటుంబాలను ప్రోత్సహించే లక్ష్యానికి అత్యంత అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం, అదే విధంగా భవిష్యత్తులో చూపేటటువంటి ఆర్థిక, పరిపాలనా ప్రభావాన్ని సైతం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ధనిక, పేద ఉండేటటువంటి ఆర్థిక అంతరాలను తగ్గించడమే లక్ష్యంగా వివిధ సంక్షేమ పథకాలకు సమగ్ర ఆర్థిక అర్హత ప్రమాణాల్ని పరిశీలించిన తర్వాత సిఫార్సు చేయాలి.

### పథకాల వారీగా ప్రయోజనాలు

చిన్న కుటుంబం (1–3 సభ్యులు) మధ్యస్థ కుటుంబం (4–6 మంది సభ్యులు), పెద్ద కుటుంబం (7–ఆపైన) దృష్టిలో పెట్టుకుని పథకాల వారీగా ప్రయోజనాలకు సంబంధించి సంస్కరణలను సిఫార్సు చేయడం, పెద్ద కుటుంబాలను ప్రోత్సహించే విధంగా, ప్రయోజనాల కోసం విడిపోయే కుటుంబాలను నిరుత్సాహపరిచే విధంగా ఉండాలి. ప్రజాధనాన్ని సమర్థంగా వినియోగించేలా ఉండటంతో పాటుగా సామాజిక భద్రతను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందులో భాగంగానే వివిధ పథకాల ద్వారా పొందే మొత్తం ప్రయోజనాలపై గరిష్ట పరిమితి కోసం ఫ్రేమ్?వర్క్?ను సమీక్షించి సిఫార్సు చేయడం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అదే విధంగా ప్రతిపాదిత ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్?మెంట్ బిల్లు, ఇతర నిబంధనలను సమీక్షించడం, కుటుంబ డేటా బేస్ నిర్వహణకు ప్రత్యేక అథారిటీ నియామకం, డేటాబేస్ అప్?డేట్ తయారీ, వినియోగం, ఏపీలో పథకాలు, అంతేకాకుండా సేవల పంపిణీకి ఫ్యామిలీ కార్డుల జారీ, వినియోగం మొదలైన తదితర అంశాలపై సిఫార్సు చేయాలి.

రాబోయే రోజుల్లో పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేలా ఆలోచనలు చేస్తున్నామని గత నెలలో అమరావతిలో నిర్వహించిన మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థ అనేది మనకు భద్రత కల్పిస్తుందని, దాన్ని మరింత బలపరిచే బాధ్యత ప్రభుత్వానిపై ఉన్నదని సీఎం వివరించారు. ప్రస్తుతం జనాభా ఆందోళనకర స్థాయిలో తగ్గిపోతుందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. దంపతులు ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలను కనాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. మరికొందరైతే పిల్లల్ని కనే ఆలోచననే మానుకున్నారని, అయితే అది మంచి విధానం కాదని సీఎం చంద్రబాబు హితవు పలికారు.

# తిరుపతిలో 10 అంతస్తుల్లో బస్ స్టాండ్

**తిరుపతి :** తిరుపతికి శ్రీవారి దర్శనం కోసం నిత్యం భారీగా భక్తులు తరలివస్తుంటారు. ఈ మేకు భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు నగరంలో ప్రస్తుతం ఉన్న బస్టాండ్ స్థానంలో ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు రూ.470 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణాన్ని ఈపీసీ విధానంలో నిర్మించాలని అధికారులు నివేదికను పంపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిలో మౌలిక వసతుల్ని మరింత మెరుగుపరిచేందుకు సిద్ధమైంది. తిరుమల శ్రీవారి దర్శనం కోసం నిత్యం వేలాదిమంది భక్తులు తిరుపతికి వస్తుంటారు. ఈ క్రమంలో తిరుపతిలో మరిన్ని మౌలిక వసుతల్ని కల్పించే దిశగా ప్రణాళిక రూపొందించింది. తిరుపతిలో ప్రస్తుతం ఉన్న మెయిన్ బస్టాండ్ స్థానంలో కొత్తగా ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ నిర్మించాలని నిర్ణయం తీసుకోగా.. తాజాగా దీనికి సంబంధించి కీలక ముందడుగు వేసింది. తిరుపతి ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్‌కు ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో నిర్మించాలని తేల్చారు. తిరుపతిలో ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీకి చెందిన బస్టాండ్ స్థలంలో.. ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ (నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్) బస్ టెర్మినల్‌ను రూ.470 కోట్ల అంచనాతో ప్లాన్ చేశారు. ఈ టెర్మినల్ నిర్మాణానికి సంబంధించి మూడు విధానాలను (బీవోటీ, హామ్, ఈపీసీ) అధ్యయనం చేశారు. వాటిలో ఈపీసీ బావుంటుందని ప్రభుత్వానికి ప్రతిపాదనల్ని కూడా పంపారు. తిరుపతి బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్, తిరుమల, ఆ చుట్టుపక్కల ఉన్న ఆలయాలకు వెళ్లే భక్తులకు ఈ టెర్మినల్ కీలకంగా మారింది.. అందుకే దీనికి ఇంటర్ మోడల్‌గా పేరు పెట్టారు. ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ డీపీఆర్ తయారు చేసేందుకు రైట్స్ (రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ లిమిటెడ్)ను సలహా సంస్థగా నియమించారు.ప్రస్తుతం ఉన్న తిరుపతి బస్టాండ్, డిపో కలిపి మొత్తం 13.18 ఎకరాల్లో ఉంది. ఇందులో 7.11 ఎకరాల్లో ఈ బస్ టెర్మినల్ ప్లాన్ చేశారు. రోడ్డు పక్కన ఉన్న 4.29 ఎకరాలను కమర్షియల్‌గా అభివృద్ధి చేయనున్నారు.99 సెంట్ల భూమిని రోడ్డు కోసం, 79 సెంట్ల భూవిని ఫ్లై ఓవర్ కోసం నిర్మించనున్నారు. బస్ టెర్మినల్‌లో పార్కింగ్ కోసం సెల్లార్‌లో రెండు అంతస్తులు ప్లాన్ చేశారు. ఇలా ఆయ సదుపాయాల కోసం భూమిని కేటాయించారు. ప్రస్తుత ప్లాన్ ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం టెర్మినల్‌కు కేటాయిస్తారు. మొత్తం 98 ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం.. టెర్మినల్ ప్రాంగణంలో మరో 50 బస్సులు నిలిపేందుకు వీలుగా స్థలం కేటాయించనున్నారు.టెర్మినల్ గ్రౌండ్ ఫ్లోర్ పైన 10 అంతస్తులు నిర్మించి కమర్షియల్ (హోటళ్లు, రెస్టారెంట్లు, డార్మెటరీలకు, మిగిలిన షాపులకు) కేటాయిస్తారు. అంతేకాదు టెర్మినల్‌లోని పదో ఫ్లోర్‌లో హెలీప్యాడ్ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ టెర్మినల్ నుంచి బస్టాండ్, రైల్వే స్టేషన్‌ను కనెక్ట్ చేసేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇటీవల అధికారులు ఈ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నవారితో అధికారులు మాట్లాడారు.. వారి నుంచి అభిప్రాయాలసేకరించి పభుత్వానికి నివేదిక పంపించనున్నారు. కమర్షియల్‌గా కేటాయించబోయే వాటితో లాభాల పరిస్థితి.. ఆర్టీసీకి ఎంత ఇస్తారు, ఒప్పందం ఎన్నేళ్లు అనే అంశాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను మరో చోటికి తరలిస్తే 5 ఎకరాల భూమి, డిపో కోసం మరో ఐదు ఎకరాలు తాత్కాలికంగా కేటాయించాలని ఆర్టీసీ జిల్లా కలెక్టర్‌ను కోరింది.


తిరుమల ఆలయాన్ని ప్రతిబింబించేలా బస్టాండ్ ముఖద్వారం నమూనా

## 'వచ్చే 6 నెలల్లో 10 లక్షల ఎల్పీజీ కనెక్షన్లు ఇవ్వాలి'

-మొదటిపేజీ తరువాయి

పీఎన్జీ కనెక్షన్ తీసుకున్నా దీపం పథకం ద్వారా కలిగే లబ్ధి పొందవచ్చన్న విషయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. గ్యాస్ సరఫరా ఇబ్బందులను అధిగమించడానికి ఆయిల్ కంపెనీలు పీఎన్జీ కనెక్షన్లను పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. వచ్చే 6 నెలల్లో మొత్తం 10 లక్షల పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని, ఈ విషయంలో జాప్యం ఉండకూడదని, టార్గెట్ ఎట్టిపరిస్థితుల్లో చేరుకోవాలని చెప్పారు.

### కేంద్ర మంత్రికి చంద్రబాబు ఫోన్

గృహ అవసరాలకు సంబంధించి గ్యాస్ సరఫరాలో సమస్యలను అధిగమించామని ఈ సందర్భంగా అధికారులు సీఎం చంద్రబాబుకు తెలిపారు. డొమెస్టిక్ పంపిణీకి సంబంధించి సమస్యను తగ్గించామని, త్వరలో సాధారణ స్థితికి తీసుకువస్తామన్నారు. శ్రీకాకుళం – కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్ లైన్ పనుల్లో జాప్యంపై సీఎం అధికారుల వివరణ కోరారు. దీనికి సంబంధించి కేంద్రం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని అధికారులు చెప్పడంతో సమీక్ష నుంచే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి చంద్రబాబు ఫోన్ చేశారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి అయినందున వెంటనే పనులు పూర్తి చేసేలా చూడాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే సమీక్షించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ఎల్పీజీ, పీఎన్జీ మధ్య వ్యత్యాసం

ఎల్పీజీ, పీఎన్జీ సిలిండర్ ధర వ్యత్యాసం చూసుకుంటే గ్యాస్ సిలిండర్ ధర ప్రతినెలా సుమారు రూ.1,000 పైనే ఉంటుంది. పీఎన్జీ బిల్లు ధర రెండు నెలలకు దాదాపు 500–600 కంటే ఎక్కువ రాదు. ఈ రెండింటి మధ్య 50 శాతం తేడా ఉంటుంది. యుద్ధ ప్రభావం వల్ల సిలిండర్ దొరక్క చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ బుక్ చేసి వెయిట్ చేయాల్సిన అవసరం లేదని, పైపుల ద్వారానే గ్యాస్ వచ్చేస్తుందని ప్రభుత్వం ఇప్పటికే తెలిపింది. నిరంతరం పైపుల ద్వారానే గ్యాస్ సరఫరా అవుతుందని, మధ్యలో ఆగిపోవడం వంటివి ఉండవు అని వెల్లడించింది. ఎల్?పీజీతో పోల్చుకుంటే పీఎన్జీ కనెక్షన్ అనేది చాలా ప్రయోజనకరమైనదిగా ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా దీపం పథకం లబ్ధిదారులు పీఎన్జీకి మారితే, వారికి దీపం పథకం కింద ఇచ్చే రాయితీ సొమ్మును జమ చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పీఎన్జీ కనెక్షన్ తీసుకున్నా దీపం పథకం ద్వారా కలిగే లబ్ధి పొందవచ్చన్న విషయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు తాజాగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## 'క్రిమినల్‌తో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి'

-మొదటిపేజీ తరువాయి

పుస్తకాల పంపిణీ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు మంత్రులు ఓనర్ షిప్ తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ మంత్రి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి 4 కార్యక్రమాల్లోనైనా పాల్గొనాలని సూచించారు. కూటమి ఎమ్మెల్యేలూ ఇదే అనుసరించాలన్నారు. జలధారకు ఉపాధి హామీ నిధులు అనుసంధానం అయ్యేలా పనులు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకం కింద వీలైనన్ని ఎక్కువ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ ఉండాలన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధుల నివారణకు కృషి చేసేలా స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

బెదిరింపు రాజకీయాలను ధీటుగా తిప్పికొట్టాలి

ఈ సందర్భంగా కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయాలు ప్రమాదకరమన్న సీఎం అన్నారు. క్రిమినల్?తో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు సీఎం సూచించారు. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు ప్రచారం చేసే క్రిమినల్ కుట్రలను మంత్రులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ తిప్పికొట్టాలని సూచించారు. ప్రజలకు వాస్తవాలు చెప్తూ వారిని చైతన్య పరచాలన్నారు. బెదిరింపు రాజకీయాలను ధీటుగా తిప్పికొట్టాలని ఆదేశించారు.

కార్యదర్శుల పనితీరుపై చంద్రబాబు అసంతృప్తి

అంతకు ముందు కార్యదర్శుల పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. క్యాబినెట్ భేటీ ప్రారంభమైనా, అజెండా తమకు రాలేదని సీఎం వద్ద మంత్రి మనోహర్ ప్రస్తావించారు. అజెండా ముందే వస్తే స్టడీ చేసుకుని క్యాబినెట్‌కు వచ్చే వీలు ఉండేదని అన్నారు. దీనిపై స్పందించిన సీఎం కార్యదర్శుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవస్థలు మరింత ఉపసయోగపడాల్సిందిపోయి రాను రానూ మరింత సంక్లిష్టంగా మారుతున్నాయని అధికారుల తీరును చంద్రబాబు తప్పుబట్టారు.

డీమ్డ్ యూనివర్సిటీలను ఎక్కువ ప్రొమోట్ చేయాలి


గతంలో కార్యదర్శులు సబ్జెక్టుల్లో భాగస్వాములవుతూ చర్చల్లో ఏ సందేహం వచ్చినా పూర్తిగా నివృత్తి చేసేందుకు చొరవ చూపేవారన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. డీమ్డ్ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఎక్కువ ప్రొమోట్ చేయాలని సీఎం ఆదేశించారు. 10 ఎకరాలకు తక్కువ కాకుండా నిబంధనలు పెట్టి నాణ్యత పెంచుతూ, ఎక్కువ డీమ్డ్ యూనివర్సిటీలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో తక్కువ డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయని అన్నారు.

## పవర్ ఫుల్ ఉమెన్ నుంచి జైలు గోడలవరకు... కళింగిరి శాంతి ప్రస్థానం

**కాకినాడ :** దేవాదాయ శాఖలో అత్యంత వివాదాస్పద అధికారిగా పేరుపొందిన అసిస్టెంట్ కమిషనర్ కళింగరి శాంతి ఉదంతం, అధికార బలం ఉంటే వ్యవస్థలను ఎలా శాసించవచ్చో చెప్పడానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. కేవలం ఆరేళ్ల సర్వీసులో, అందులోనూ రెండేళ్ల సస్పెన్షన్ కాలం పోను, కేవలం నాలుగేళ్లలోనే ఆమె సృష్టించిన ప్రకంపనలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా ఏసీబీ దాడుల్లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయ్యి, 14 రోజుల రిమాండ్‌కు వెళ్లడంతో ఆమె అప్రతిహత ప్రస్థానానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. 2020లో దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరిన కళింగరి శాంతికి, అప్పటి అధికార పార్టీలో కీలక నేతగా ఉన్న విజయసాయి రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఆ రాజకీయ అండతో ఆమె అటు ఉద్యోగ పరంగా, ఇటు వ్యక్తిగత జీవితంలోనూ తీవ్ర వివాదాలకు కేంద్రబిందువైంది. భర్త మదన్ మోహన్‌తో విడాకులు తీసుకోకుండానే మరొకరితో సహజీవనం చేయడం, ఒక బిడ్డకు జన్మనివ్వడం వంటి అంశాలు అప్పట్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఆ బిడ్డ తండ్రి ఎవరనే విషయంలో భర్త మదన్ మోహన్ చేసిన ఆరోపణలు, విజయసాయి రెడ్డికి డీఎన్ఏ పరీక్షలు చేయాలన్న డిమాండ్లు అప్పట్లో సంచలనం సృష్టించాయి. శాంతి అధికార దర్పం ఏ స్థాయిలో ఉండేదంటే, విశాఖపట్నంలో పనిచేస్తున్న సమయంలో తన పై అధికారి అయిన డెప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్ గదిలోకి చొరబడి ఆయనపై ఇసుక చల్లడం ఆమె బరితెగింపునకు పరాకాష్ట. ఒక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఆమె ఈ చర్యకు పాల్పడటం గమనార్హం. ఈ ఘటన సీసీటీవీలో రికార్డ్ అయినప్పటికీ, విచారణాధికారి తప్పు పట్టినప్పటికీ, ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకోకుండా, ఫిర్యాదు చేసిన పై అధికారిని బదిలీ చేయడం వ్యవస్థల నిర్వీర్యానికి నిదర్శనం. దీంతో మనస్తాపం చెందిన డెప్యూటీ కమిషనర్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. విశాఖలో పని చేస్తున్న సమయంలో 'ప్రేమ సమాజం' భూములు, ఇతర దేవాదాయ భూముల లీజుల వ్యవహారంలో ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆమెను సస్పెండ్ చేసినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఆమెను డిస్మిస్ చేసే ఫైల్ ముందుకు కదలలేదనే విమర్శలు ఉన్నాయి. కోర్టు ఆదేశాలతో మార్చి చివరి వారంలో తిరిగి పోస్టింగ్ పొందిన శాంతి, పది రోజులు గడవకముందే ఏసీబీ వలలో చిక్కుకుంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే అభియోగంపై ఏసీబీ ఆమెను అరెస్ట్ చేసి జైలుకు పంపింది. శాంతి ఉదంతం రెండు ముఖ్యమైన పాఠాలను నేర్పుతుంది. రాజకీయ నాయకుల మద్దతు ఉంటే చట్టాన్ని, నిబంధనలను అతిక్రమించవచ్చనే ధీమా అధికారులను ఎంతటి పతనానికి తీసుకెళ్తుందో శాంతి జీవితం ఒక హెచ్చరిక. ఒక జూనియర్ అధికారి ఇంతగా రెచ్చిపోతున్నా.. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఆమె విషయంలో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయి. కోర్టు ఆదేశాలు ఇచ్చే వరకు లేదా ఏసీబీ దాడులు జరిగే వరకు వేచి చూడటం వ్యవస్థల బలహీనతను సూచిస్తుంది.

# అనంతపురం జిల్లాలో యువనాయకుడిగా అమర్నాథ్ రెడ్డి ఎదుగుదల

## - యువత సమస్యల పరిష్కారమే లక్ష్యమని స్పష్టం చేసిన సంగిరెడ్డి అమర్నాథ్ రెడ్డి



**కదిలించే వార్త, ఏప్రిల్ 10, అనంతపురం జిల్లా:**
అనంతపురం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా సంగిరెడ్డి అమర్నాథ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన తన నియామకంపై స్పందిస్తూ, పార్టీ తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ కీలక బాధ్యతలను అప్పగించిన పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి గారికి, అలాగే అనంతపురం అర్బన్ మాజీ శాసనసభ్యులు అనంత వెంకట్రామిరెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యువతను సమీకరించి పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరిస్తానని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తూ నాయకత్వం నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని సంగిరెడ్డి అమర్నాథ్ రెడ్డి స్పష్టం చేశారు.

# మైనార్టీలకు అండగా నిలిచి సమస్య పరిష్కరిస్తానన్న బీటెక్ రవి





**తొండూరు కదిలించే వార్త ఏప్రిల్ 10**
పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలం మల్లెల గ్రామం గుండా వెళ్తున్న హైవే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా స్థానిక మసీదుకు ఆటంకం కలగడంపై గ్రామంలోని మైనార్టీ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ విషయాన్ని పులివెందుల టీడీపి ఇంచార్జ్ బీటెక్ రవి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి విచ్చేసిన బీటెక్ రవి మైనార్టీ సోదరుల విన్నపాన్ని మన్నించి వెంటనే క్షేత్రస్థాయిలో మసీదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మతపరమైన కట్టడాలకు ప్రాముఖ్యతనిస్తూ, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. వెంటనే సంబంధిత హైవే కాంట్రాక్టర్‌తో ఫోన్లో మాట్లాడి, మసీదుకు ఎటువంటి నష్టం కలగకుండా లేదా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సమస్యను ఎలా పరిష్కరించాలో చర్చించి, సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యకు ముగింపు పలుకుతానని గ్రామస్తులకు ఘనంగా మాట ఇచ్చారు. బీటెక్ రవి తక్షణ స్పందన పట్ల మల్లెల గ్రామ మైనార్టీ పెద్దలు మరియు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చింతకుంట నాగిరెడ్డి, తొండూరు మండల సింగిల్ విండో సొసైటి అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి, శివ భాస్కర్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు..

# శ్రీవారిని దర్శించుకున్న ఏపీఎల్సీ ఎథిక్స్ కమిటీ చైర్మన్ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి





**పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 10** ఆంధ్రప్రదేశ్ శాసనమండలి నైతిక విలువల కమిటీ ఏపీఎల్సీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి శుక్రవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. కమిటీ చైర్మన్ హోదాలో తిరుమలకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం తన సహచర కమిటీ సభ్యులతో కలిసి ఆయన స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు .దర్శనానంతరం మీడియా ప్రతినిధులతోభూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూరాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. శాసనమండలి ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కమిటీ సభ్యులతో కలిసి స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ దర్శన కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వీరికి వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి


## - నా పరిధిలో ఎక్కడ నేరం జరిగినా ఊరుకోను
## - లాటి, బెల్ట్, గన్ వీటిలో ఏది ఉపయోగించే పరిస్థితి తేవద్దండి
## - పులివెందులను ప్రశాంతమైన ప్రాంతంగా మార్చడమే నా లక్ష్యం
## - పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్,



**పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 10**
రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుండా ఉంటే చర్యలు తప్పవని,నా పరిధిలో ఎక్కడ నేరం జరిగిన సహించేది లేదు అని,గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపి కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల పట్టణ పరిధిలో 140 మంది రౌడీ షీటర్లు కు పులివెందుల అర్బన్ సీఐశ్రీరామ్ కౌన్సిలింగ్ ఇస్తూ లాటి, బెల్ట్, గన్ వీటిలో ఏది ఉపయోగించే పరిస్థితి తీసుకురావద్దనిహెచ్చరిస్తూ శుక్రవారం పులివెందుల పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేసిన తప్పులను వదిలేసి, సమాజంలో గౌరవప్రదమైన పౌరులుగా జీవించాలని సూచించారు. రౌడీ షీటర్లు ఎవరైనా తప్పు చేస్తే తప్పుచేసిన దగ్గరి నుంచే కొట్టుకుంటూ స్టేషన్కు తీసుకొని వస్తానని,నా పరిధిలో ఎక్కడ నేరం జరిగినా సహించేది లేదు అని,అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే ఎంతటి వారి పైన చట్టరీత్యా చర్యలు చేపడతామని,పోలీసులు మర్యాదగా చెబుతున్నప్పుడు మారాలని,లేనిపక్షంలో లాఠీకి పని చెప్పడమే కాకుండా, అవసరమైతే పిస్టల్ వాడటానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. మీ ప్రవర్తనను బట్టే మా చర్యలు ఉంటాయి అని ఆయన గట్టిగా హెచ్చరించారు. పట్టణంలో గంజాయి వినియోగం,విక్రయాల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని,యువత జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న గంజాయి నెట్‌వర్క్‌పై సమాచారం ఇవ్వాలని కోరారు. నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలతో పాటు జిల్లా బహిష్కరణ (నగర బహిష్కరణ) తప్పదని హెచ్చరించారు. ఇటీవల జరిగిన అల్లర్ల వీడియోలను పరిశీలిస్తున్నామని,గొడవలకు దిగిన ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. పోలీసులకు కులాలు,మతాలు లేదా రాజకీయ పార్టీలతో సంబంధం ఉండదని,కేవలం చట్టం ప్రకారమే విధులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పులివెందులను ప్రశాంతమైన ప్రాంతంగా మార్చడమే తమ లక్ష్యమని,ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సి.ఐ.శ్రీరామ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మధుసూదన్ రెడ్డి పోలీస్ సిబ్బంది రౌడీషీటర్లు తదితరులు పాల్గొన్నారు.

# అడ్వెంచర్ క్యాంపులు శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి...

## - ప్రిన్సిపాల్ డా. మల్లెల రవికుమార్



**కడప ఏప్రిల్ 10 కదిలించే వార్త**
శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో అడ్వెంచర్ క్యాంపులు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రధానాచార్యులు డాక్టర్ మల్లెల రవికుమార్ అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలిలో ఏప్రిల్ 17 నుండి 26వ తేదీ వరకు జరగనున్న అడ్వెంచర్ క్యాంపులో ఆర్ట్స్ కళాశాల తరపున ఎన్.సి.సి క్యాడెట్ బి. మురళి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా క్యాడెట్ మురళిని ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్.సి.సి అధికారి కెప్టెన్ నీలయ్య మాట్లాడుతూ అడ్వెంచర్ క్యాంపుల్లో ఎన్.సి.సి క్యాడెట్లు పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు, జట్టు నిర్వహణ, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ఒత్తిడిని తట్టుకోవడం, సహనం వంటి విలువైన అంశాలు అలవడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి అధికారి లెఫ్టినెంట్ మహేష్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

# రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు



పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 10
పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారము పురస్కరించుకుని ఉదయస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం,కుంకుమార్చన ,మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం అమ్మవారు విశేష పూల అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేకించి ఆలయున ఉదయం 10.30 నిమిషములకు రాహుకాల దీపాలు వెలిగించి రాహుకాల పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు..ఈరోజు కాలాష్టమి సందర్భముగా ప్రత్యేక ఎరుపు రంగు దీపాలు వెలిగించి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భముగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ,అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ ప్రతి శుక్ర,పౌర్ణమి,అమావాస్య రోజున అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర వడిబయ్యము,కుంకుమార్చన,బోనాలు సమర్పించి తమ మొక్కలు చెల్లించు కోవడంజరుగుతుందన్నారు.ప్రత్యేకించి ఆది,మంగళ,శుక్రవారములు,పౌర్ణమి,అమావాస్య రోజున అమ్మవారికి 108 ప్రదక్షిణములు చేసి నమస్కరించిన యెడల కోరిన కోరికలు తీరుతాయని భక్తుల అపారమైనటువంటి నమ్మకము.ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి.అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసినటువంటి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. .ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ,భక్తదులందరూ పాల్గొన్నారు

# ఫ్రైడే - డ్రైడే పాటించండి.. సీజనల్ వ్యాధులను తరిమికొట్టండి

## - సబ్ యూనిట్ అధికారి: సిద్దయ్య





తొండూరు కదిలించే వార్త ఏప్రిల్ 10
తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ని మదూరు గ్రామములో దోమల వ్యాప్తిని అరికట్టడానికి మరియు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాప్తికి కారణం అయ్యే దోమలను లార్వా దశలోనే అరికట్టడానికి ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించడమైనది. ఈ కార్యక్రమములో నీటి నిల్వలను తొలగించాలని, ప్రతి శుక్రవారం మీ ఇంట్లో మరియు ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న పాత నీటిని (తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, టైర్లు, కూలర్లు) పూర్తిగా పారబోసి, శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి అని, ?దోమల ఉత్పత్తిని అరికట్టాలి అంటే నిల్వ నీటిలోనే దోమలు గుడ్లు పెట్టి వృద్ధి చెందుతాయి. కేవలం వారం రోజుల పాటు నీరు నిల్వ ఉన్నా దోమల వ్యాప్తి అధికమవుతుంది.పరిసరాల పరిశుభ్రత ద్వారా ఇంటి చుట్టూ పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవాలి అని, మురుగు కాలువల్లో నీరు నిలవకుండా జాగ్రత్త పడాలి. అని రాత్రి సమయంలో దోమతెరాలు వాడాలి అని సిద్దయ్య తెలిపారు. ఈ కార్యక్రమములో ఆరోగ్య కార్యకర్తలు సతీష్ కుమార్, అశ్వని, కేశమ్మ, ఆశా కార్యకర్త రాజేశ్వరీ, అంగన్ వాడి కార్యకర్త మహేశ్వరీ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం:

## - ప్రజా దర్బార్’లో బీటెక్ రవి




సింహాద్రిపురం కదిలించే వార్త ఏప్రిల్ 10
పులివెందుల నియోజకవర్గ ప్రజల కష్టాలను తీర్చి, వారికి అండగా ఉండటమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని శుక్రవారం సింహాద్రిపురంలోని తన స్వగృహంలో నిర్వహించిన ‘ప్రజా దర్బార్’లో బి టెక్ పేర్కొన్నారు. వాటిలో భాగంగాప్రజల నుండి వినతులు స్వీకరించడం జరిగింది. నియోజకవర్గం నుంచి ?వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను ఓపికగా విన్న ఆయన, అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు తానూ ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజలు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భ్రమరాంబిక దేవికి కలిశాభిషేకం

## ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన భ్రమరాంబికా దేవి





వేముల కదిలించే వార్త ఏప్రిల్ 10
వేముల మండలంలో మబ్బు చింతలపల్లి లో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబికా దేవి ఆలయంలో శుక్రవారం పురస్కరించు కొని ఉదయాస్తమాన గురుస్వామి వెంకటరావి రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి 108 బిందెల కలిశా పూజ పంచా మృత అభిషేక కైకరియాలు కుంకు మార్చన కార్యక్రమాలు వేదమంత్రో చారనతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకు న్నారు. ఈ సందర్భంగా గురుస్వామి వెంకట్ర ామిరెడ్డి మాట్లాడుతూ ఎంతో మహిమగల భ్రమరాంబిక దేవి ఆలయానికి భక్తులు తండోపతండాలుగా వచ్చి అమ్మవారికి మహా నైవేద్యం కాయ కర్పూరాలు సమర్పించి విశేష పూజ నిర్వహించే అమ్మవారు ఆశీస్సులు పొందడం జరిగిందని, సాయంకాల సమయాన 108 దీపాలంకరణ పల్లకి సేవ విశేష పూజలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# అర్థాంతరంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులకు సహకరించండి

**- 32వ వార్డు అభివృద్ధి పనులపై మంత్రి పి.నారాయణకు వినతి**

**- నిధులు కేటాయించాలని కోరిన సీనియర్ టిడిపి నాయకుడు మద్దూరి వెంకట రామిరెడ్డి**



పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 10

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డు (బ్రాహ్మణపల్లి) లో గత ప్రభుత్వ హయాంలో అర్థాంతరంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురపాలక శాఖామాత్యులు పి. నారాయణ కి వినతి పత్రం సమర్పించారు.పులివెందుల పట్టణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మద్దూరి వెంకట రామిరెడ్డి ఈ మేరకు విన్నవించారు.వార్డులో భూగర్భ డ్రైనేజీ పనులు దాదాపు 70% పూర్తయ్యాయని,మిగిలిన 30% పనులు నిలిచిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.డ్రైనేజీ పనుల కోసం రోడ్లను తవ్వి అలాగే వదిలేయడం వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, వర్షాకాలంలో ఈ పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.32వ వార్డు మరియు 33వ వార్డులను కలిపే సుమారు 1 కిలోమీటరు మేర లింక్ రోడ్డుకు మెటల్ వేసి వదిలేశారని,దీనిని పూర్తి చేయాలని కోరారు.చిన్నారుల పార్కులో ఆట పరికరాలు అమర్చినప్పటికీ,సివిల్ పనులు (బెడ్ వర్క్) పెండింగ్‌లో ఉండటం వల్ల ఆ నిధులు వృధా అవుతున్నాయని పేర్కొన్నారు. వార్డులో తాగునీటి పైప్‌లైన్ పనులు 85% పూర్తయ్యాయని,మిగిలిన 15% పనులు పూర్తి కాకపోవడంతో నీటి సమస్య తీవ్రంగా ఉందని వివరించారు. ప్రజల జీవన అవసరాలను దృష్ట్యా మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయాలని మరియు అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని మద్దూరి వెంకట రామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# పదవి విరమణ వయసు పెంచండి.

**- అధ్యక్షులు అంజా నాయక్**




కడప ఏప్రిల్ 10 కదిలించే వార్త

ఉద్యోగ విరమణ వయస్సు ను ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పెంచాలని ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ అవుట్సోర్సింగ్ సర్వీస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజా నాయక్ పేర్కొన్నారు. శుక్రవారంకడప నగరంలోని వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు జీవో ఎం.ఎస్ నెంబర్ 15 ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయసు 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాల కు పెంచారు.అదేవిధంగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పెంచాలని కోరారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ అమలు చేసే పతకాలైన అమ్మఒడి, స్కాలర్షిప్ల ,ఫీజు రియంబర్స్మెంట్ ,ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు, మొదలైన ప్రయోజనాలు పొందలేక పోతున్నార న్నారు. కావున ప్రభుత్వం ప్రస్తుత సమాజంలో అన్ని రకాలుగా ధరలు పెంచడం వలన ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు చాలీచాలని జీతాలు వలన ఎన్నో అవస్థలు పడుతున్నారు. వారికి కూడా తగినంత జీతాలను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఔషోర్సింగ్ ఉద్యోగులు కూడా వయసును పెంచి వారిని ఆదుకోవాలని,అదే విధంగా రిటైర్మెంట్ అయిన ఉద్యోగస్తులకు అన్ని అలయన్స్ లను త్వరగా అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ చంద్రమౌళి ,జనరల్ సెక్రటరీ ఋషికేశవరెడ్డి, జాయింట్ సెక్రటరీ వినోద్ కుమార్, ట్రెజరర్ సుధాకర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ నెంబర్ చెన్నారెడ్డి, హరినాయక్ ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొందండి.

**- ఇంటింటికీ వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు.**



వేంపల్లె కదిలించే వార్త ఏప్రిల్ 10

వేంపల్లెలోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవి తెలిపారు. శుక్రవారం ఉర్దూ జూనియర్ కళాశాల అధ్యాపకులు వేంపల్లె పంచాయతీ పరిధిలో ఆయా ప్రాంతాల్లో ఉన్న పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి అడ్మిషన్లకు చెందిన కరపత్రాలను పంపిణీ చేసి ప్రచార కార్యక్రమం చేపట్టారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అందించే విద్యా బోధనపై అవగాహన కల్పించారు. ఆహ్లాదకరమైన భవనాల్లో విద్యార్థులు ఇంటర్మీడియట్ పూర్తి చేసేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నట్లు అధ్యాపకులు తెలిపారు. ఉర్దూ జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసి వంటి గ్రూపులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పదోవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన వెంటనే విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని కోరారు. ఉర్దూ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫారం తో పాటు మధ్యాహ్నం భోజన పథకం కూడ ఉన్నట్లు తెలిపారు. అడ్మిషన్ ఫీజు కూడ తక్కువ అన్నారు. అలాగే విద్యార్థులకు తల్లికి వందనం పథకం కూడ వర్తిస్తుందని చెప్పారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా ఉర్దూ జూనియర్ కళాశాలలో కూడ నాణ్యత గల విద్యా బోధన విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఉర్దూ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ల్యాబ్ సౌకర్యంతో పాటు అన్ని వసతులు ఉన్నట్లు అధ్యాపకులు తల్లిదండ్రులకు తెలిపారు.తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రచార కార్యక్రమంలో అధ్యాపకులు మహమ్మద్ షరీఫ్, ఫైరోజ్ ఖాన్, ఇర్ఫాన్, బాషా, షఫివుల్లా, ఫక్రుద్దీన్ లు పాల్గొన్నారు.

# ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో గెట్ 2026 విజయోత్సవ సమావేశం



వేంపల్లె కదిలించే వార్త ఏప్రిల్ 10 ఉన్నత విద్య మరియు పోటీ పరీక్షల విభాగపు సమన్వయకర్త డా. డి. కోనప్ప ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీ లో గేట్ 2026 విజయోత్సవ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ కుమార స్వామిగుప్త మాట్లాడుతూ, గేట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలో 5వ ర్యాంక్, 8వ ర్యాంకు, 22 వ ర్యాంక్, 53 వ ర్యాంక్, 84 వ ర్యాంక్ తో పాటు 36 మంది విద్యార్థులు 1000 లోపు జాతీయ ర్యాంకులు సాధించారాని, మొత్తంగా 155 మంది విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలు విశ్వవిద్యాలయ ప్రతిష్టను మరింత పెంచుతాయని, ఈ విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. పరిపాలనాధికారి డా. రవికుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ ఉన్నత విద్య కోసం సరైన సంస్థలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఉన్నత కెరీర్ సాధనలో సంస్థ ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుందని తెలిపారు. కోనప్ప మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అనంతరం గెట్ 2026 లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కలిసి డైరెక్టర్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే డైరెక్టర్ చేతులమీదుగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు మరియు ప్రశంసా పత్రాలు అందజేశారు. విజేతలు తమ అనుభవాలను పంచుకుంటూ, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ జి రమేష్, కంప్యూటర్ సైన్స్ విభాగపు అధిపతి డాక్టర్ రత్నకుమారి , సివిల్ డిపార్ట్మెంట్ అధిపతి ధనుంజయ, సహాయ ఆచార్యులు వీరేష్ షాజాద్, డా. వెంకటేష్, భాస్కరయ్య, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతిరెడ్డి మరియు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

# బిజెపి ఒక శనిగ్రహాం.

**- వైకాపా,టిడిపిలు రాహు కేతువులు .**

**- వైకాపా, టీడీపీలది సవతుల పోరు.**

**- రాష్ట్ర సమగ్రాభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం.**

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.**



వేంపల్లె కదిలించే వార్త ఏప్రిల్ 10

రాష్ట్రానికి బిజెపి ఒక శని గ్రహములా పట్టుకున్నదని ,ప్రాంతీయ పార్టీలైన వైకాపా, టీడీపీలు రాహు కేతువులుగా దాపురించాయని,రాష్ట్ర సమగ్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా,టిడిపిలది సవతుల పోరుగా తయారైందని,ఈ రెండు పార్టీలు రాష్ట్ర అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని, సవతులు కొట్లాడుకున్నట్టు నిరంతరము పొట్లాటలతోనే సరిపోయిందని తులసి రెడ్డి అన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నవ్యాంధ్రప్రదేశ్ కు మూడు వరాలు ప్రకటించింది.ఒకటి ప్రత్యేక హోదా. రెండవది ప్రత్యేక ప్యాకేజ్. మూడవది వివిధ సెక్షన్ల కింద,షెడ్యూల్ల కింద దాదాపు 5 లక్షల కోట్ల రూపాయలు విలువ చేసి ప్రయోజనాలు కేంద్రం రాష్ట్రానికి అందించడం. ప్రత్యేక హోదా రాష్ట్రానికి సంజీవని లాంటిది.ఇది ఆంధ్రప్రదేశ్ కు హక్కు. కానీ అమలు కాలేదు. విభజన చట్టంలో సెక్షన్ 46 సబ్ సెక్షన్ 3 ప్రకారము కేంద్ర ప్రభుత్వం రాయలసీమకు,ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద నిధులు ఇవ్వాలి. కానీ ఇవ్వలేదు. విభజన చట్టంలో 13వ షెడ్యూల్డ్ ప్రకారము కేంద్ర ప్రభుత్వము స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో సమీకృత ఉక్కు కర్మాగారం నిర్మించాలి.మేజర్ ఓడరేవు నిర్మించాలి. సెక్షన్ 94 సబ్ సెక్షన్ 3 ప్రకారము రాజధాని ప్రాంతంలో రాజ్ భవన్,రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ భవనం, శాసనమండలి భవనం,హైకోర్టు తదితర మౌలిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వము గ్రాంట్ రూపంలో నిధులు ఇవ్వాలి.సెక్షన్ 90 ప్రకారము పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వము త్వరలో పూర్తి చేసి జాతికి అంకితం ఇవ్వాలి. పైన పేర్కొన్న అంశాలన్నీ అమలై ఉండి ఉంటే ఈపాటికి నవ్యాంధ్ర స్వర్ణాంధ్రై ఉండేది . కానీ దురదృష్టవశాత్తు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మోసగారితనం, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల చేతగానితనంతో 12 సంవత్సరాలైనా ఇవి అమలుకు నోచుకోలేదు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే పైన పేర్కొన్న అంశాలన్నీ ఎప్పుడో అమలై ఉండేవి. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలైన వైకాపా టిడిపిల మధ్య రోజూ సవతుల పోరు జరుగుతూ ఉంది. మావిగన్ పేరుతో వైకాపా సెల్ఫ్ గోల్ కొట్టుకుంటూ ఉండగా, అమరావతి పేరుతో టిడిపి సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటూ రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేశాయి.రాష్ట్ర సమగ్ర అభివృద్ధి గ్రాండ్, ఓల్డ్, గోల్డ్ పార్టీ అయిన కాంగ్రెస్ తోనే సాధ్యమని తులసి రెడ్డి అన్నారు.

# తాత్కాలిక విద్యుత్ అంతరాయం.



వేంపల్లె కదిలించే వార్త ఏప్రిల్ 10

నేడు చక్రాయపేట 220కేవీ ఎస్ ఎస్ లో మెయింటినెన్స్ కారణంగా ఉదయం 5:30 నుండి 7 గంటల వరకు చక్రాయపేట మండలం మొత్తం, పల్లెలంతా కరెంటు ఉండదు.అలాగే వేంపల్లె 132 కె వి ఎస్ ఎస్ లో మెయింటినెన్స్ కారణంగా ఉదయం 8:30 నుండి 10:30 వరకు వేంపల్లె మండలం మొత్తం, పల్లెలుకు కూడా ఎక్కడ కరెంటు ఉండదని డి ఈ ఈ పి. వెంకట నాగేంద్ర తెలియజేశారు. ముందస్తు సమాచారం తెలియజేస్తూ వేంపలే మండల ప్రజలు మరియు చక్రాయపేట మండల ప్రజలు మాకు సహకరిస్తారని తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదం దురదృష్టకరం.

# మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.



వేంపల్లె కదిలించే వార్త ఏప్రిల్ 10

రాయచోటిలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న వేంపల్లె క్రిస్టియన్ కాలనీకి చెందిన కందా శేఖర్, చక్రాయపేట మండలం చిలే కాంపల్లికి చెందిన మోకా నాగిరెడ్డి గురువారం రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారి పార్థివదేహాలను వేంపల్లె ప్రభుత్వాసుపత్రి మార్చురీ లో రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, మహిళా కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షురాలు శ్యామలమ్మ,పదవీ విరమణ చెందిన వార్డెన్ నాగన్న, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, నామా వినయ్ సందర్శించారు. వారి పవిత్ర ఆత్మకు భగవంతుడు ప్రశాంతిని ప్రసాదించాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులను బంధుమిత్రులను ఓదార్చారు.

# జడ్పీ షాపింగ్ గదులను పరిశీలించిన సిఇఓ




వేంపల్లె కదిలించే వార్త ఏప్రిల్ 10

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న జడ్పీ షాపింగ్ గదులను జడ్పీ సిఇఓ రామచంద్రారెడ్డి పరిశీలించారు. శుక్రవారం జడ్పీ సిఇఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సిఇఓ సుబ్రహ్మణ్యంలు వేంపల్లెలోని ఎంపిడిఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈనేపథ్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న జడ్పీ గదులను పరిశీలించి వ్యాపారస్తులతో సమస్యలపై ఆరా తీశారు. అలాగే జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ లో ఖాళీగా ఉన్న గదులకు త్వరలో వేలం పాటలు వేస్తామని జడ్పీ సిఇఓ రామచంద్రారెడ్డి తెలిపారు. రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా వ్యాపారాలు లేవని ఇబ్బందిగా ఉందని కాబట్టి బాడుగలు తగ్గించాలని షాపింగ్ కాంప్లెక్స్ లోని వ్యాపారులు కోరారు. దీంతో అధికారులతో చర్చించి తగు న్యాయం చేస్తామని సిఇఓ హామీ ఇచ్చారు. పెండింగ్ బాడుగలు సకాలంలో చెల్లించాలని వ్యాపారస్తులను జడ్పీ సిఇఓ కోరారు. ఈయన వెంట డిప్యూటీ సిఇఓ సుబ్రహ్మణ్యం, ఎంపిడిఓ కుళాయమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.


# టమోటా ధరల్లేక రైతులు విలవిల



తొండూరు కదిలించే వార్త ఏప్రిల్ 10 : టమోటా ధరల్లేక రైతులు విలవిలలాడుతున్నారు. ఇక్కడి వాతావరణం అనుకూలం కావడంతో సంవత్సరం పొడవునా తొండూరు మండలంలోని రైతులు టమోటా సాగుచేస్తారు. కొన్ని నెలలుగా 15 కిలోల బాక్సు ధర రూ.100 నుంచి రూ.150 వరకు పలుకుతోంది. వ్యాపారులు ఇక్కడ టమోటాను కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. అక్కడ రాష్ట్రాల్లో టమోటా దిగుబడి ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు టమోటా కొనుగోలుకు మొగ్గు చూపడంలేదు. దీంతో రైతులు టమోటాను మార్కెట్ తీసుకొస్తే కొందరు వ్యాపారులు స్థానికంగా అమ్మడానికి మేలు రకం టమోటాను కొనుగోలు చేసి మిగతా వాటి కొనుగోలుకు మొగ్గుచూపడంలేదు. దీంతో రైతులు టమోటాను మార్కెట్‌లోనే ఉంచి తమ గ్రామాలకు చేరుకొంటున్నారు. టమోటా ధరలతో కోత కూలీ కూడా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరు టమోటాను తోటల్లో కోయకుండా వదిలివేస్తున్నారు. మరికొందరైతే టమోటా పంటను ట్రాక్టర్ ద్వారా దున్ని ఇతర పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు.

# గృహ యజమానుల పేర్లను ఇంటి పన్ను రశీదుల్లో అధికారికంగా నమోదు చేయాలి

## - మున్సిపల్ శాఖ మంత్రికి విన్నపం



**పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 10** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నివసిస్తున్న గృహ యజమానుల పేర్లను ఇంటి పన్ను రశీదుల్లో అధికారికంగా నమోదు చేయాలని కోరుతూ గౌరవ మున్సిపల్ శాఖ మంత్రి వర్యులకు వినతి పత్రం సమర్పించారు.?పులివెందుల మున్సిపాలిటీలోని 33వ వార్డు అనేకమంది గృహ యజమానులు సుమారు 20 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఇంటి పన్నులు చెల్లిస్తున్నారు. అయినప్పటికీ,వారి ఇంటి పన్ను రశీదుల్లో యజమాని పేరు ఉండాల్సిన చోట ది హోల్డర్ అఫ్ ది ప్రేమిసెస్ అని నమోదవుతోందని,?ఈ విషయమై స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించగా, రశీదుల్లో పేరు నమోదు కావాలంటే రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు తప్పనిసరి అని అధికారులు పేర్కొంటున్నారు.అయితే,సదరు ప్రాంతాల్లోని ఇళ్లు ప్రభుత్వం గతంలో పేదలకు అందించిన వీకర్ సెక్షన్ లేఅవుట్ లో భాగంగా ఉండటంతో,చాలామంది వద్ద రిజిస్టర్డ్ పత్రాలు లేని పరిస్థితి నెలకొందన్నారు.?ఈ సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి,ఏళ్ల తరబడి పన్నులు చెల్లిస్తున్న యజమానుల పేర్లను నేరుగా రశీదుల్లో నమోదయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని పులివెందుల పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు మంత్రి ని కోరారు.

# ప్రకృతి వ్యవసాయంలో కూరగాయలు ఆరోగ్యానికి రక్ష





**లింగాల కదిలించే వార్త ఏప్రిల్ 10**

ఆరోగ్యానికి రక్షబి ప్రకృతివ్యవసాయంలోపండినకూరగాయలు ఎంతగానో దోహదపడతాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పేర్కొన్నారు.లింగాల మండలంలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పండించినటువంటి పురుగుమందులు, రసాయనాలు లేని కూరగాయలు ఆకుకూరలను లింగాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాళ్లు పెట్టి అమ్మడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితోపాటు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో మా సిబ్బంది పండించినటువంటి పురుగుమందులు రసాయనాలు లేని ఆకుకూరలు కాయగూరలను వైద్య సిబ్బంది మరియు రోగులు రైతులు వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలియజేశారు. అలాగే ప్రతి నెల ఇక్కడ ఏదో ఒక వారంలో స్టాళ్లు నిర్వహిస్తామని అందుకు వైద్య సిబ్బంది సహకరించాలని తెలియజేశారు. అదేవిధంగా మండల ఇన్చార్జి జయ నాయక్ మాట్లాడుతూ మా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పండించి నటువంటి ఆకుకూరలు కూరగాయలు, ఇతర ఆహార ధాన్యాలు, పండ్లను డిమాండ్ కు తగినట్టు సప్లై చేస్తామని, అందుకు కొద్దిగా అధిక ధరలు మా రైతులకు ఇవ్వవలసి ఉంటుందని అందుకు వినియోగదారులు అర్థం చేసుకోవాలని తెలియజేశారు . మోడల్ మేకర్ యామినీ లత మాట్లాడుతూ కెమికల్ ద్వారా పండించే ఉత్పత్తులు నాణ్యత లేనివి గా ఉంటాయని, వాటి ద్వారా ఆరోగ్యానికి హానికరమని,ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రత్యేక ధరలు ఉంటే రాబోవు కాలంలో ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతాయని అందుకు ప్రజలు అర్థం చేసుకోవాలని, పెరటి తోటలు, న్యూట్రి గార్డెన్స్,మిద్దెలపై పెరటి తోటలు ప్రతి ఒక్కరూ పెంచుకొని ఆరోగ్యంగా ఉండి వైద్య ఖర్చులు తగ్గించుకోవాలని తెలియజేశారు. డాక్టర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ చిన్నచిన్న స్టాళ్లు కాకుండా అధిక మొత్తంలో ప్రజల డిమాండ్కు కావలసిన సప్లై ని విరివిగా పండించి అందరికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందివ్వాలని, ఇలాంటి కార్యక్రమాలలో మా వంతు సహకారం ఉంటుందని, కెమికల్స్, పురుగుమందులు లేనటువంటి ఆకుకూరలు కాయగూరలు పండిస్తున్న మీరందరికి భవిష్యత్తులో మంచి జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుభాషిని, శాంతి, పర్వీన్, ఫార్మసిస్ట్ శిరీష, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, అటెండర్ గోపాల్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పివి రమణ, భాస్కర్ నాయక్, ఆనంద నాయక్, శంకర్ నాయక్, పి జయలక్ష్మి, వి.జయలక్ష్మి, గంగాభవాని, యశోద, బాదుల్లాబి, శోభ, శోభ రాణి, హరిత, నాగేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఎథిక్స్ కమిటీ సమావేశం

## - ముఖ్యఅతిథిగా కమిటీ చైర్మన్- ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి





**తిరుపతి కదిలించే వార్త ఏప్రిల్ 10** తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఎథిక్స్ కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి కమిటీ చైర్మన్ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథులు మరియు పాల్గొన్న వారుఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పలువురు కమిటీ సభ్యులు మరియు టీటీడీ ఉన్నత అధికారులు పాల్గొన్నారు: కమిటీ సభ్యులు వై. శివ రామి రెడ్డి .ఎమ్ హనుమంతరావు ,టీటీడీ అధికారులు: టీటీడీ జేఈఓ వెంకయ్య చౌదరి తిరుపతి జేఈఓ వీరబ్రహ్మం టీటీడీ ఎస్.ఓ మురళీధర్రావు శాసనమండలి ప్రతినిధులు ఏ పి ఎల్ సి జాయింట్ సెక్రటరీ విజయ రామ రాజు మరియు ఇతర ప్రభుత్వ అధికారులు.సమావేశంలోని ముఖ్యాంశాలు సమావేశంలో ప్రధానంగా ఈ క్రింది అంశాలపై చర్చలు మరియు సమీక్షలు జరిగాయి: కార్యక్రమాల సమీక్ష తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల సౌకర్యార్థం మరియు సామాజిక బాధ్యతగా చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలను కమిటీ సమీక్షించింది. విద్యాసంస్థల్లో నైతిక విలువలు టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందిస్తున్న నైతిక విలువల బోధనపై ప్రత్యేకంగా చర్చించారు. అభివృద్ధి పనులు విద్యా, ధార్మిక రంగాలలో టీటీడీ అనుసరిస్తున్న విధానాలు, భవిష్యత్తులో చేపట్టబోయే ఇతర కార్యక్రమాలపై అధికారులకు కమిటీ పలు సూచనలు చేసింది.టీటీడీ విద్యాసంస్థల్లో విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో నైతిక విలువల పాత్ర అత్యంత కీలకమని ఈ సందర్భంగా చైర్మన్ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# ప్రజాసేవలో నా ప్రయాణానికి స్ఫూర్తి వైయస్ కుటుంబీకులే

## - అవినాష్ రెడ్డి సత్కారం నాలో సామాజిక బాధ్యతను మరింత పెంచింది

## - మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్



**పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 10** ప్రజా ప్రతినిధిగా ప్రజాసేవకుడిగా నా ప్రయాణానికి వైయస్ కుటుంబీకులే స్ఫూర్తిదాయకమని, అభిమాన నేత ఎంపీ అవినాష్ రెడ్డి చే సత్కారం నాలో సామాజిక బాధ్యతను మరింత ప్రేరేపిస్తుందని పులివెందుల పురపాలక మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ సర్పంచులు మరియు కౌన్సిలర్ల సేవలను గుర్తిస్తూ ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాలు కార్యకర్తలు మరియు నాయకుల పట్ల పార్టీ విధేయత ప్రస్ఫుటమవుతున్నప్పటికీ పార్టీ పట్ల మరియు ప్రజాసేవ పట్ల తమ బాధ్యతను మరింత పెంచుతున్నాయని, ప్రజాసేవ అనే పవిత్ర యజ్ఞంలో ఐదు (5) సంవత్సరాల పాటు మున్సిపల్ చైర్మన్‌గా నిర్వహించిన నా ప్రజా సేవా ప్రయాణానికి గౌరవప్రదమైన శిఖరంగా నిలిచిన ఈ సన్మానం నా జీవితంలో చిరస్మరణీయమైన మైలురాయిగా నిలుస్తుందని, కడప పార్లమెంట్ సభ్యులు అవినాష్ రెడ్డి చే సత్కారం పొందడం నా జీవితంలో అపూర్వ గౌరవంగా, మరువలేని క్షణంగా భావిస్తున్నానని, ఇది కేవలం ఒక సన్మానం మాత్రమే కాదని నా కృషికి వచ్చిన గొప్ప గుర్తింపు, నాపై ఉంచిన విశ్వాసానికి ప్రతీక, ఈ గౌరవం నాకు మరింత బాధ్యతను గుర్తు చేస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజా సేవలలో మరియు సమాజ సేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలుస్తోందని, ఈ గౌరవాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ,ఎప్పుడూ నన్ను ఆదరించిన నా బలగం, నా కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని, మీ ఆశీస్సులు, మద్దతు ఎల్లప్పుడూ నాతో ఉండాలని ఆకాంక్షించారు.

# శెట్టిపల్లి భూముల రిజిస్ట్రేషన్ల ప్రారంభం -- తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి కు ప్లాట్ల యజమానుల ఘన సన్మానం



**తిరుపతి కదిలించే వార్త 10 ఏప్రిల్** తిరుపతి తుడా కార్యాలయంలో శెట్టిపల్లి భూమి లుదశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న శెట్టిపల్లి భూముల రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం కావడంతో, ఆ ప్రాంత ప్లాట్ల యజమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా తుడా కార్యాలయంలో తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి ప్లాట్ల యజమానులు బాధితులు కలిసి ఘనంగా సత్కరించారు.రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా చొరవ చూపినందుకు కృతజ్ఞతగా చైర్మన్ కలిసిన బాధితులు, ఆయనపై పూల వర్షం కురిపిస్తూ, శాలువాలతో ఘనంగా సత్కరించారు.తుడా కార్యాలయం ప్రాంగణంలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి ప్లాట్ల యజమానులు స్థానిక నాయకులు మరియు తుడా అధికారులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి:

## - అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ నాయకులు పిలుపు





కడప ఏప్రిల్ 10 కదిలించే వార్త

భారత రాజ్యాంగ నిర్మాత, మహానేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ నాయకులు సగిలి గురప్ప, ఆంజినేయులు , జయవర్ధన్, సుబ్బరాయుడు,అంకన్న, ఓబయ్య, జగన్ నాయక్, రాజేంద్ర ప్రసాద్, గోపి, హరి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ అంబేద్కర్ సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సామాజిక న్యాయం సాధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.కడప నగరంలో ఈ నెల 14 వ తేదీన ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ర్యాలీ కోటిరెడ్డి సర్కిల్ నుండి ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వరకు జరగనున్నదని తెలిపారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఆయన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.కావున అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# కొమ్మనుతల గ్రామంలో గ్రామ సభ, రౌడీ షీటర్స్ కదలికలపై ప్రత్యేక నిఘా,



లింగాల కదిలించే వార్త ఏప్రిల్ 10



లింగాల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమ్మనుతల గ్రామంలో గ్రామ సభ, రౌడీ షీటర్స్ కదలికలపై ప్రత్యేక నిఘా, వారి ఇళ్లకు జియోటాగ్ , సైబర్ క్రైమ్ ,బాల్యవివాహాలు , చీటింగ్, సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలు వంటి వాటిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం పులివెందుల రూరల్ సి ఐ సీతా రామి రెడ్డి లింగాల ఎస్.ఐ జగదీశ్వర్ రెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారంజిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా రాత్రి వేళల్లో లింగాల మండలంలో కొమ్మనుతల గ్రామంలో పులివెందుల డి.ఎస్పీ బి. మురళి పర్యవేక్షణలో గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా పులివెందుల రూరల్ సి ఐ సీతారామిరెడ్డి లింగాల ఎస్.ఐ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ,పేకాట, గంజాయి, అక్రమ మద్యం, నాటు సారా విక్రయిస్తే అటువంటి వారిపై పోలీసు శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సైబర్ క్రైమ్, భూతగాదాలు, మహిళలు చిన్నారులపై జరిగే నేరాలు , చీటింగ్ , సోషల్ మీడియా పోస్టులు,పోక్స్ కేసుల వంటి వాటిపై గ్రామ సభ నిర్వహించారు. అదేవిధంగా నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంటుందని ఎక్కడైనా గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.నేరాల నియంత్రణ కోసం పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని, అందులో భాగంగా ప్రజలు కూడా మీ గ్రామాలలో ఎక్కడైనా ఏ సమస్యలు ఉన్నా, అపరిచిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లింగాల పి.ఎస్ ఎస్.ఐ జగదీశ్వర రెడ్డి తెలియజేశారు. అందరూ కలసి మెలసి ఉండాలని సూచించారు. ఈ గ్రామ సభలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్లకు వడదెబ్బ గురించి అవగాహన కార్యక్రమం

## - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జగదీష్



తిరుపతి కదిలించే వార్త 10 ఏప్రిల్

తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ లో మార్గదర్శకత్వంలో తిరుపతి ఏపీఎస్ఆర్టీసీ నందు వడదెబ్బ నివారణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది బస్టాండ్ లో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు మరియు అక్కడ వేచి ఉన్న ప్రయాణికులకు సూర్యా ఘాతం వడ దెబ్బ గురించి అవగాహన కల్పించారు.అధికారులు మాట్లాడుతూ వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బప్రమాదం పెరుగుతుందని బయట పనిచేసే కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఉపయోగించే విధానాన్ని డెమోన్స్ట్రేషన్ నిర్వహించి అక్కడ ఉన్న ప్రజలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది.బస్టాండ్ ఆవరణంలో కూలింగ్ ఏరియాస్,తాగునీటి సదుపాయం, ఓఆర్ఎస్ కార్నర్ పాయింట్లు ఏర్పాటు చేయాలని డి ఎం హెచ్ ఓ సూచించారు. వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు 1 ఎండలో బయటకు వెళుతున్నప్పుడు టోపీ,రుమాలులేదా గొడుగు ఉపయోగించాలి. 2. తేలికపాటి కాటన్ దుస్తులు ధరించాలి. 3.దాహం లేకపోయినా తరచూ నీరు త్రాగాలి 4.ఓ ఆర్ ఎస్ ద్రావణం, నిమ్మరసం, మజ్జిగ వంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి 5.ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయట పనులు మానుకోవాలి. వడదెబ్బ లక్షణాలు: తలనొప్పి, తల తిరగడం,అధిక శరీర ఉష్ణోగ్రత,వాంతులు,అలసట,చమటలు ఆగిపోవడం,అపస్మారక స్థితి.ఒకవేళ ఈ లక్షణాలు . ఈ కార్యక్రమంలో ఎన్ సి డి పి. ఓ. డాక్టర్ రెడ్డి ప్రసాద్,డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సెల్వియా,డిపిఎమ్ఓ డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, డీఎస్ఓ డాక్టర్ జితేంద్ర ఆర్టీసీ రీజనల్ మేనేజర్,కంట్రోలర్,యూపీహెచ్సీ వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్సీడీ సిబ్బంది మరియు ఐ డి ఎస్ పి పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు

# ద్రోహులే ద్రోహం గురించి మాట్లాడటం..వైసీపీ నేతలకే చెల్లింది

## - 2021లోనే ఆగిపోయిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ను.. మేమేలా ఆపుతాం

## - వైసీపీ నేతల రౌండ్ టేబుల్ సమావేశంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ఆగ్రహం

## - సీమలో 102ప్రాజెక్టులు ఆపిన నిజమైన ద్రోహి జగన్ రెడ్డి..ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 10 : ద్రోహులే ద్రోహం గురించి మాట్లాడటం.. ఒక్క వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలకే చెల్లిందని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంపై అనంతపురంలో వైసీపీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగే దొంగ అన్నట్టుగా, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఆపిన వైసీపీ వారే మళ్లీ నిందలు వేస్తున్నారన్నారు. జగన్ పాలనలోనే ఆగిపోయిన రాయలసీమ లిఫ్టును కూటమి ప్రభుత్వం మళ్లీ ఎలా ఆపుతుందని ప్రశ్నించారు. 2021లో ఆగిపోయిన లిఫ్ట్ నిర్మాణాలకు నాలుగేళ్లల్లో అనుమతులు ఎందుకు తీసుకురాలేకపోయారని.. అనేక సార్లు ఢిల్లీకి వెళ్లి ఏం సాధించారని నిలదీశారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడానికే ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నరాన్నారు. ఆరేళ్లలో రూ.12 లక్షల కోట్లు బడ్జెట్ ఖర్చు చేసిన జగన్ అందులో సీమ ప్రాజెక్టులకు ఇచ్చింది... కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నవ్యాంధ్రలో రూ.20 వేల కోట్లు ఖర్చు పెట్టారన్నారు. గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్, బిటి ప్రాజెక్ట్ లాంటి 102 రాయలసీమ ప్రాజెక్టుల పనుల్ని జీఓ 365తో జగన్ ప్రభుత్వం ఎందుకు రద్దు చేసిందని దగ్గుపాటి ప్రసాద్ నిలదీశారు. చంద్రబాబుకు మంచి పేరు వస్తుందని చాలా ప్రాజెక్టులు ఆపిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 90 శాతం సబ్సిడీతో చంద్రబాబు డ్రిప్ పథకాన్ని ప్రవేశపెట్టగా, దాన్ని రద్దు చేశారన్నారు. రాయలసీమ హార్టికల్చర్ అభివృద్ధికి జగన్ నష్టం చేసింది నిజం కాదని ఈ వైసీపీ నాయకులు చెప్పగలరా దగ్గుపాటి సవాల్ విసిరారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ తో సహా నేటి రాయలసీమ ప్రాజెక్టుల్లో 80 శాతం ఎన్టీఆర్ చంద్రబాబు నిర్మించినవేనన్నారు. రాయలసీమ జలదాతలు ఎన్టీఆర్, చంద్రన్న అయితే అసలైన రాయలసీమ ద్రోహి జగన్ అని దగ్గుపాటి విమర్శలు చేశారు. దాదాపు రాయలసీమ హార్టికల్చర్ హబ్ కోసం రూ.30 వేల కోట్లు బడ్జెట్ లో కేటాయింపులు చేశారని.. అది చంద్రబాబుకు సీమపై ఉన్న చిత్తశుద్ధి అన్నారు. రాయలసీమకు జగన్ ఏమీ చేయలేదు కాబట్టే.. అంత దారుణ ఓటమి చూశారన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చే ఒక యజ్ఞానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారని.. చేతనైతే సహకరించాలని కానీ దానికి అడ్డుపడవద్దని వైసీపీ నాయకులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హితవు పలికారు..

# జలజీవన్ మిషన్ పథకం ద్వారా..

## - నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందించండి..

## - ఏపీ 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ కు ఐడీసీ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ విజ్ఞప్తి..




అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 10 :

స్వర్ణాంధ్ర 2047 సాధనే దేయంగా సమిష్టి కృషి చేస్తామని ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పుట్టపర్తి కలెక్టరేట్ లో ఏపీ 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐడీసీ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ పుట్టపర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు జలజీవన్ మిషన్లో భాగంగా తాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం

## -12న పలు కార్యక్రమాలకు శ్రీకారం..



అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 10 : ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకుని సద్గురు శ్రీ రాజ్య లక్ష్మమ్మ ప్రణవ లీలా ఆధ్యాత్మిక ఆశ్రమంలో ఘనంగా నిర్వహిస్తామని సీనియర్ మోస్ట్ హోమియోపతి ఫిజీషియన్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్. రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్రీయ ఆయుష్ మెడికల్ అసోసియేషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. పోగుల కుమారయ్య తెలిపారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. హోమియోపతి వ్యవస్థాపకుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హనేమన్ జయంతి సందర్భం గా ప్రపంచ హోమియోపతి దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా 271వ ప్రపంచ హోమియోపతి దినోత్సవ వారోత్సవాలలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12న కమల నగర్ లో సద్గురు శ్రీ రాజ్య లక్ష్మమ్మ ప్రణవ లీలా ఆధ్యాత్మిక ఆశ్రమంలో ఆదివారం ఉదయం 10 గంటలకు హోమియోపతి వైద్యం ద్వారా సామరస్యం.. సరిహద్దులు లేని స్వస్థత అనే పేరుమీద హోమియోపతి వైద్య విధానాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడం, సంపూర్ణ, ఆధారిత ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కమిటీ వారు, సద్గురు శ్రీ రాజ్యలక్ష్మమ్మ ప్రణవ లీలా ఆధ్యాత్మిక ఆశ్రమ కమిటీ వారు ఉచిత హోమియో చికిత్స శిబిరం నిర్వహణ కమిటీ వారు, హోమియోపతి వైద్యులు, హోమియో వైద్య అభిమానులు, హోమియోపతి వైద్యం పొందుతున్న ప్రజలు కార్యక్రమంలో భాగంగా సన్ స్ట్రోక్ నివారణకు ముందు జాగ్రత్త చర్యగా ఉచిత హోమియో మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు తప్పకుండా విచ్చేసి హోమియోపతి ఉపయోగాలు తెలుసుకుని తమ ఆరోగ్యాన్ని పదిలం చేసుకోవాలని డాక్టర్ పోగుల కుమారయ్య కోరారు.

# వేసవిలో దాహం తీర్చే చలివేంద్రం

## - సేవా భావానికి నిలువెత్తు నిదర్శనం - డా. విజయ్ బాబు ముందడుగు

## - అభి ట్రస్ట్ సేవలకు అభినందనలు - నగర పంచాయతీ కమిషనర్ నూర్ అలీఖాన్..



కడప ఏప్రిల్ 10 కదిలించే వార్త


వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పాదాచారులు, వాహనదారులు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహం తీర్చేందుకు అభి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాదీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎన్. విజయ్ బాబు సేవా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు, కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ నూర్ అలీ ఖాన్ ప్రారంభించారు, ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహాన్ని తీర్చడం పుణ్యకార్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు, అభి చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని, ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎన్. విజయ్ బాబును ప్రత్యేకంగా అభినందించారు, అనంతరం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎన్. విజయ్ బాబు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో సేవ చేయడం మా ట్రస్ట్ లక్ష్యం, వేసవిలో నీటి అవసరం అత్యవసరం కాబట్టి, బాటసారుల దాహం తీర్చేందుకు ప్రతి సంవత్సరం చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే ఈ కార్యక్రమంలో ఖాదర్ బాషా, సునీల్, అనిల్, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో పారిశుద్ధ్యానికి టీటీడీ పెద్దపీట

## - భక్తులకు నిరంతరాయంగా నాణ్యమైన పారిశుద్ధ్య సేవలు

## - మొబైల్ వాటర్ ట్యాంకులతో శ్రీవారి సేవకుల ద్వారా తాగునీరు పంపిణీ

## - టీటీడీ ఏర్పాట్లపై భక్తుల్లో సంతృప్తి





తిరుమల కదిలించే వార్త ఏప్రిల్ 10

తిరుమలలో భక్తుల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణకు టీటీడీ పెద్ద పీట వేస్తోంది. రోజుకు సగటున 80 వేల నుండి 1 లక్ష మంది భక్తులు సందర్శిస్తున్న నేపథ్యంలో సుమారు 4.5 చదరపు కిలోమీటర్ల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ సమర్థంగా కొనసాగుతోంది.పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడానికి తిరుమల ప్రాంతాన్ని మూడు జోన్లుగా, ఏడు వార్డులుగా విభజించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. అలాగే డిఓఓ ట్రేడ్ లైసెన్సులను నియంత్రించి నో స్టాక్ -- నో గోడౌన్ లైసెన్సులను జారీ చేయడం జరుగుతోంది. వార్డు-1లో శ్రీవారి ఆలయం పరిధిలో విభాగ సిబ్బంది ప్రత్యక్షంగా పనిచేస్తుండగా, వార్డు-2 నుండి 7 వరకు పారిశుద్ధ్య పనులు మూడు కాంట్రాక్ట్ సంస్థల ద్వారా నిర్వహిస్తున్నారు.సమర్థవంతంగా చెత్త సేకరణతిరుమలలో చెత్త సేకరణను సమర్థవంతంగా నిర్వహించేందుకు 9 టిప్పర్ వాహనాలు పనిచేస్తున్నాయి. రోజుకు సుమారు 45 ట్రిప్పులు చేసి, సుమారు 3,056 చెత్త బిన్స్ నుండి చెత్త సేకరణ జరుగుతోంది. అన్ని వాహనాలు కలిపి రోజుకు సుమారు 400 కిలోమీటర్ల మేరా ప్రయాణిస్తున్నాయి.2025 సంవత్సరానికి సంబంధించిన గణాంకాలు బయోడిగ్రేడబుల్ వ్యర్థాలు: 16,689.04 మెట్రిక్ టన్నులు.నాన్ బయోడిగ్రేడబుల్ వ్యర్థాలు: 8,221.97 మెట్రిక్ టన్నులు.మొత్తం వ్యర్థాలు: 24,911.01 మెట్రిక్ టన్నులు.మరుగుదొడ్ల సదుపాయాలుతిరుమలలో భక్తుల సౌకర్యార్థం వార్డు వారీగా విస్తృతంగా మరుగుదొడ్ల బ్లాకులు ఏర్పాటు చేశారు.మొత్తం శాశ్వత టాయిలెట్ బ్లాకులు: 210.సంస్థల టాయిలెట్లు: 130.తాత్కాలిక టాయిలెట్లు: 14.మొత్తం టాయిలెట్ బ్లాకులు: 354.మొబైల్ వాటర్ డ్రమ్స్ తో శ్రీవారి సేవకుల ద్వారా తాగునీరు పంపిణీతిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉండే పలు ప్రాంతాల్లో మొబైల్ వాటర్ డ్రమ్స్ ద్వారా శ్రీవారి సేవకులతో తాగునీరు పంపిణీ చేయడం జరుగుతోంది. వేసవి ప్రారంభమవ్వడంతో భక్తులు తాగునీటికి ఇబ్బంది పడకుండా నేరుగా భక్తుల వద్దకే శ్రీవారి సేవకులు వెళ్లి తాగునీరు అందిస్తున్నారు. నీరు, ఆహార నాణ్యత పర్యవేక్షణ టీటీడీ నీరు, ఆహార విశ్లేషణ ప్రయోగశాల 1981లో స్థాపించబడింది. ప్రస్తుతం చీూదీూ గుర్తింపు పొందిన ఈ ల్యాబ్ భక్తులకు అందించే నీరు, ఆహారం నాణ్యతను కఠినంగా పరీక్షిస్తోంది. ప్రతిరోజూ లడ్డూ, అన్నప్రసాదం తయారీలో ఉపయోగించే పదార్థాల పరీక్షలు, నీటి నమూనాల విశ్లేషణ (రోజుకు సుమారు 20 నమూనాలు), నెలకు 1000--1200 నమూనాల పరీక్షలు, నెయ్యి నాణ్యత పరీక్షలకు ఆధునిక HPLC, GC యంత్రాలు వినియోగంలో ఉన్నాయి.కొత్త ఫుడ్ ల్యాబ్ ఏర్పాటుభారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ ద్వారా ఇటీవల రూ.19.75 కోట్లతో అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ ఏర్పాటు జరిగింది. ఇందులో LC-MS/MS, GC-MS/MS, ICP-MS/MS వంటి ఆధునిక సాంకేతిక పరికరాలు ఏర్పాటు చేయడం జరిగింది నాణ్యమైన పారిశుద్ధ్య సేవలపై భక్తుల్లో సంతృప్తితిరుమలలో టీటీడీ ఆరోగ్య విభాగం అందిస్తున్న నాణ్యమైన పారిశుద్ధ్య సేవలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా టీటీడీ ఎప్పటికప్పుడు చెత్తను సేకరిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టడం, మరుగుదొడ్లను అనునిత్యం పరిశుభ్రంగా ఉంచడం వంటి చర్యలపై భక్తులు టీటీడీని ప్రశంసిస్తున్నారు. తిరుమలకు విచ్చేసే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, తిరుమలలో పారిశుద్ధ్య, చెత్త నిర్వహణ, మరుగుదొడ్ల సదుపాయాలు, ఆహార భద్రతను టీటీడీ అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తోంది. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి, భక్తులకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా టీటీడీ పని చేస్తోంది.

# ప్రతి బిడ్డకు 1000 రోజుల పోషకాహారంతో కూడిన సంరక్షణ అవసరం...

## - పోషణ పక్వాడ కార్యక్రమంలో సూపర్వైజర్ విష్ణువర్ధని...





అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 10 :

ఐసిడిఎస్ సింగనమల ప్రాజెక్టు పరిధిలోని గార్లదిన్నె మండలం పాత కల్లూరు గ్రామంలో గల ఒకటవ అంగన్వాడి సెంటర్ నందు శుక్రవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం రెండవ రోజు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామంలో గర్భవతులకు, బాలింతలకు పోషకాహారం మరియు పిల్లల ఎదుగుదల పట్ల అవగాహన కల్పించడంలో భాగంగా సూపర్వైజర్ విష్ణువర్ధని మాట్లాడుతూ జంక్ ఫుడ్,ఉప్పు మరియు నూనెలను అధిక మోతాదులో వాడటం వల్ల జరిగే నష్టాల గురించి తెలియజేయడం జరిగింది. అదేవిధంగా పిల్లల 80% మెదడు ఎదుగుదల అంశంపై అవగాహన కల్పిస్తూ ప్రతి బిడ్డకు తప్పనిసరిగా వేయి రోజుల పోషకాహారంతో కూడిన సంరక్షణ అవసరమని తెలియజేశారు. పోషకాహారం తీసుకోవడం వల్ల బిడ్డకు మానసిక మరియు శారీరక ఎదుగుదల, మరియు పిల్లలలో ఐదు రకాల అభివృద్ధి, మరియు పోషకాహార లోపం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి తెలియజేయడం జరిగింది. అంతేకాకుండా మొబైల్ స్క్రీన్ ఎక్కువ చూడడం వల్ల తల్లులకు మరియు పిల్లలకు మానసిక శారీరక సమస్యలు వస్తాయని చిన్న వయసులోనే ఊబకాయము, షుగర్ ఏకాగ్రత లోపం, చురుకుదనం తగ్గడం, ఇలాంటివి కూడా పోషకాహార లోపం వల్ల వచ్చే ప్రమాదం ఉందని పలు రకాల విషయాలపై అవగాహన జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ విష్ణువర్ధని, అంగన్వాడి వర్కర్ శాంతకుమారి, సహాయకురాలు రమాదేవి, ఆశ వర్కర్ సుశీలమ్మ, గర్భవతులు, బాలింతలు పాల్గొనడం జరిగింది.

# రాయలసీమకు ద్రోహి జగన్ రెడ్డి.. టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

## - రాయలసీమను రతనాల సీమలా మారుస్తున్న సీఎం చంద్రబాబు..

## - అభివృద్ధికి అడ్డుపడకుండా సహకరించండి.. పూల నాగరాజు



అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 10 :

రాయలసీమకు జగన్ రెడ్డి కుటుంబం ద్రోహం చేస్తే... టీడీపి ప్రభుత్వం న్యాయం చేసిందని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు. అందుకు సాక్ష్యం నేడు రాయలసీమలోని జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలే అందుకు నిదర్శనమన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పై అనంతపురంలో వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాయలసీమకు ఏం చేశామో వివరించాలన్నారు. జగన్ రెడ్డి పిచ్చి తుగ్లక్ పాలనలో రాయలసీమ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్, బిటి ప్రాజెక్ట్ లాంటి 102 రాయలసీమ ప్రాజెక్టుల పనుల్ని జీఓ 365 తో జగన్ ప్రభుత్వం ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. రాయలసీమ రైతులకు ఉపయోగకరమైన డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని కూడా జగన్ రద్దీ చేశారన్నారు. హంద్రీనీవా కెనాల్ 1700 క్యూసెక్కుల సామర్థ్యాన్ని 3,500 క్యూసెక్కుల సామర్థ్యానికి జగన్ ఎందుకు పెంచలేకపోయారని నిలదీశారు. జగన్ పాలనలోనే ఆగిపోయిన రాయలసీమ లిఫ్టు కూటమి ప్రభుత్వం ఎలా అపివేస్తుందన్నారు. 2021లో ఆగిపోయిన లిఫ్ట్ నిర్మాణాలకు నాలుగేళ్ళల్లో అనుమతులు ఎందుకు సాధించలేకపోయారన్నారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడానికి కుట్ర చేసింది రాయలసీమ వాసులు ఇంకా మర్చిపోలేదన్నారు. 2026-27 ఆర్థిక బడ్జెట్ లో రూ.10,014 కోట్లు ఒక్క రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించిన కూటమి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. దాదాపు రాయలసీమ హార్టికల్చర్ హబ్ కోసం రూ.30 వేల కోట్లు బడ్జెట్ లో కేటాయించారన్నారు. రాయలసీమ ద్రోహివి కాబట్టే నీకు 11 సీట్లు ఇచ్చారన్నది మర్చిపోవదన్నారు. సీమలో సిరి సంపదలు పండించేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్తో సహా నేటి రాయలసీమ ప్రాజెక్టుల్లో 80 శాతం ఎన్టీఆర్. చంద్రబాబు నిర్మించినవేనని పూల నాగరాజు పేర్కొన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చే ఒక యజ్ఞానికి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పూనుకున్నారని, దానికి రాక్షసుల్లా వైసీపీ నాయకులు అడ్డుపడకుండా సహకరించాలని హితువు పూల నాగరాజు హితవు పలికారు.

## అమరావతి : మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమవుతున్న ఏపీ సర్కార్..!




అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 10 :
మున్సిపల్ ఎన్నికలపై ఏపీ కేబినెట్ భేటీలో ప్రత్యేక చర్చ.
3, 4 నెలల వ్యవధిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు.
2011 జనాభా లెక్కల ప్రకారం మున్సిపల్ ఎన్నికలకు వెళ్లే అవకాశం.
ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం.


## ఘనంగా జరిగిన శుక్రవారం శుభంకరిఅమ్మవారి ఒడి బియ్యం కార్యక్రమం

**- సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో 54 శుక్రవారం జరగనున్న ఒడిబియ్యం కార్యక్రమం నాల్గవ వారం జీసస్ నగర్ (రేణుక నగర్ )శ్రీ రేణుక ఎల్లమ్మదేవాలయంలో ఘనంగా జరిగింది**





అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 10 :



పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని లలితా సహస్రనామ పారాయణం నిమ్మకాయ దీపాలతో పూజ ఖడ్గమాల మొదలగు పూజలు నిర్వహించారు. అనంతరంలిమొదట రేణుక ఎల్లమ్మ కు ఒడి బియ్యం పెట్టి అనంతరం సుగుణమ్మ అనే మహిళలకు ఒడి బియ్యం కార్యక్రమం చేశారు 54 వారాలకు ఆర్థిక సహాయాన్ని శ్రీమతి రుక్మిణి సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ మాతృమూర్తి ఆర్థిక సాయం అందిస్తున్నారు.ఆలయ అర్చకులు పార్థసారథి స్వామి వారు కార్యక్రమాన్ని శాస్త్రోతంగా నిర్వహించినారనీ సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భువన ,శ్వేతరాఘవేంద్ర ,,పల్లవి , పద్మ అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా " స్టాప్ మైనర్ డ్రైవింగ్ " ... 128 కేసులు నమోదు... రూ 213505/- ఫైన్లు విధింపు...128 వాహనాలు సీజ్

**- జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు**








అనంతపురం, క్రైమ్, కదిలించే వార్త, ఏప్రిల్ 10 :జిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్ ఆదేశాల మేరకు మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు ఈరోజు కూడా జిల్లా వ్యాప్తంగా " స్టాప్ మైనర్ డ్రైవింగ్ " కార్యక్రమం నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా... జిల్లా కేంద్రం మరియు అన్ని మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు ప్రధాన రహదారులు, తదితర ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. వాహనాలను నడుపుతున్న మైనర్లను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. స్టాప్ మైనర్ డ్రైవింగ్ లో భాగంగా ఈరోజు 128 కేసులు నమోదు... రూ 213505/- ఫైన్లు విధింపు...128 వాహనాలు సీజ్ చేశారు.

# స్మశానవాటికల్లో ముళ్లపొదలు, చెత్త దిబ్బలు తొలగించాలి

**- నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీ జస్వంత్ రావు**





**అనంతపురం, కార్పొరేషన్, కదిలించే వార్త, ఏప్రిల్ 10 :**
నగరంలో ప్రత్యేకంగా అన్నీ స్మశానవాటికల్లో చెత్త దిబ్బలు, ముళ్లపొదలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమీషనర్ శ్రీ జస్వంత్ రావ సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే నవోదయ కాలనీ వద్ద ఉన్న స్మశానవాటికను కమీషనర్ పర్యవేక్షించారు. ముఖ్యంగా స్మశానవాటికల్లో లైటింగ్, నీటి వసతి మరియు మరుగుదొడ్ల (టాయిలెట్స్) నిర్మాణాల కొరకు అంచనాలు తయారు చేసి, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, త్వరితగతిన సదుపాయాలు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులకు స్పష్టం చేశారు. కమీషనర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చెత్త నిర్వహణ సమర్థవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకుని అనంతను సుందరనగరంగా మార్చాలన్నారు. నగర సుందరకరణలో ప్రజల భాగస్వామ్యం కూడా తప్పకుండా ఉండాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయడం, కాలువల్లో ప్లాస్టిక్ గాజు పీస్ తదితర వ్యర్థాలను వదిలేయడం ద్వారా చెత్త పేరుకుపోయి, కాలువలు బ్లాక్ అయ్యే సమస్య లేకపోలేదు అన్నారు. అనంతరం నగరములో వివిధ ప్రాంతాల్లోని బళ్లారి బైపాస్, కళ్యాణ్ దుర్గం బైపాస్ సర్వీస్ రోడ్డు , ఫ్లైఓవర్ బ్రిడ్జిల క్రింద ప్రాంతాలను పరిశీలించారు. బిల్డింగ్ నిర్మాణదారులు, చికెన్ వ్యాపారులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబందించి అదికారులకు హెచ్చరించారు. కమిషనర్ వెంట ప్రజా ఆరోగ్య అధికారులు తదితరులు ఉన్నారు నగరంలోవ్యాపార సముదాల ఏరియాలలో వ్యాపారులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని, నగర సుందరీకరణలో భాగస్వాములు కావాలని నగర ప్రజలకు పిలుపునిచ్చారు. తదుపరి బళ్లారి రోడ్డులోని అన్నక్యాంటీన్‌ను సందర్శించి అల్పాహారం పంపిణీని పరిశీలించారు. అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడి ఆహార నాణ్యత, సిబ్బంది పనితీరు మరియు సమయపాలనపై వివరాలు తెలుసుకున్నారు. సేవలను మరింత మెరుగుపరచి ప్రజలలో సానుకూల అభిప్రాయం పెంపొందేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ (I/c) బి ఎల్ నరసింహ, ఇంజనీరింగ్ అదికారులు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు , శానిటేషన్ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

# పీవీకేకే ఐటి లో "యువ లాంచ్ ప్యాడ్ -- మెగా జాబ్ మేళా 2026"

**అనంతపురం రూరల్ విద్య, కదిలించే వార్త, ఏప్రిల్ 10 :**
అనంతపురంలోని పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు "యువ లాంచ్ ప్యాడ్ -- మెగా జాబ్ మేళా 2026" పేరుతో భారీ ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల యాజమాన్యం వెల్లడించింది. ఈ మేళాను ప్రముఖ సంస్థ ూౠూఞూ ూశీట్ ఎవఎిష్త్రఅశీశ్రీశీస్త్రఅవం ూజ్. ౹ా. ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మెగా జాబ్ మేళా ఏప్రిల్ 12, 2026న ఉదయం 8:30 గంటల నుంచి కళాశాల ప్రాంగణంలోని శ్రీమతి పల్లె ఉమ భవన్‌లో జరుగుతుంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యంతో కూడిన అభ్యర్థులను ప్రముఖ సంస్థలతో అనుసంధానించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.ఈ జాబ్ మేళాలో దేశంలోని పలువురు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. ముఖ్యంగా Kia, Deccan, Foxconn, Tech Mahindra, Concentrix, Genpact, Radical Minds, Sutherland, Creative Qube, Paytm, Bharat Biotech, Divis Labs, Hetero, Mahindra, Xiaomi (Mi), Hero, Axis Bank, Amazon, MedPlus, Apollo Pharmacy, Honda, DMart, Big C, SBI Card, Amara Raja, Thirumala Milk, Schneider Electric, Motherson తదితర సంస్థలు పాల్గొంటున్నాయి. ఈ మేళాలో టెక్నికల్, సాఫ్ట్‌వేర్, కస్టమర్ సపోర్ట్, ఫార్మసిస్ట్, ఆపరేషన్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ తదితర విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇంజనీరింగ్, డిగ్రీ, ఎం.టెక్, ఎంబిఏ, ఎంసిఏ, ఐటీఐ, పాలిటెక్నిక్ అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చు. 2020 నుండి 2026 వరకు చదువు పూర్తి చేసిన ఫ్రెషర్స్‌తో పాటు ఉద్యోగాన్వేషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.ఈ కార్యక్రమంలో నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హత కలిగిన అభ్యర్థులను తక్షణమే ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా ఎంపిక చేసిన అభ్యర్థులను కంపెనీలు నేరుగా కలుసుకునే అవకాశం ఉండడంతో నియామక ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని చెప్పారు.పాల్గొనే అభ్యర్థులు తమ తాజా బయోడేటా, 4-5 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్, విద్యా సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని సూచించారు.ఈ మెగా జాబ్ మేళాకు రూ. 99 ప్రవేశ రుసుము ఉండగా, నమోదు కార్యక్రమం వేదిక వద్దే నిర్వహించబడుతుంది. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ కిషోర్ పల్లె, ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రమేష్ బాబు, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ భాను కిరణ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 91 9739793681




# జిల్లా కేంద్రంలో ఘనంగా... పోలీస్ రక్షక్ ప్రైమరీ స్కూల్ నాల్గవ వార్షికోత్సవం వేడుకలు

**- పోలీసు పిల్లలకు మెరుగైన సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం**

**- జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్**






**అనంతపురం, క్రైమ్, కదిలించే వార్త, ఏప్రిల్ 10 :**
జిల్లా కేంద్రంలోని పోలీస్ కన్వెన్షన్ హాలులో ఈరోజు పోలీస్ రక్షక్ ప్రీ - ప్రైమరీ స్కూల్ నాల్గవ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. పోలీసు పిల్లలకు మెరుగైన సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందించడమే జిల్లా పోలీసుశాఖ లక్ష్యమని జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ వెల్లడించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ పాల్గొని ప్రసంగించారు. పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రయివేట్ పాఠశాలల కంటే మెరుగ్గా ఇక్కడ పాఠశాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. విద్యతో పాటు సైకర్యాలు కూడా మెరుగ్గానే ఉన్నాయన్నారు. ఆర్డీటీ వారి సహకారంతో స్పానిష్ లాంగ్వేజ్ కూడా అదనంగా పిల్లలకు నేర్పిస్తున్నామన్నారు. చిన్న వయస్సులో అయితే మంచిగా నేర్చుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకునే వీలుంటుందన్నారు. చదువులతో పాటు పిల్లలకు ఆటలు ముఖ్యమన్నారు. బాల్యం నుండే చదువుతో పాటు క్రీడలు, ఆటలకు అలవాటు పడేలా ఇటు ఉపాధ్యాయులు... అటు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీస్ రక్షక్ ప్రీ - ప్రైమరీ స్కూల్ స్పానిష్ టీచర్ మరియు స్కూలు సిబ్బందిని అభినందించడమే కాకుండా ఎస్పీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, ఆర్ ఐ లు పవన్ కుమార్ , మధు, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, గాండ్ల హరినాథ్, లక్ష్మినారాయణ, పిల్లల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొని పిల్లలను ఆశీర్వదించారు.

## బుక్కపట్నం డైట్ కళాశాల విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

**బుక్కపట్నం, కదిలించే వార్త, ఏప్రిల్ 10 :**




బుక్కపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్) కళాశాలలో నిర్వహించిన వీడ్కోలు వేడుకలకు జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, భావి భారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ట్రైనీ ఉపాధ్యాయులపై ఉందన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులతో సరదాగా గడుపుతూ, వారి భవిష్యత్తు ప్రణాళికల గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాటలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేశాయి.ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్న విద్యార్థులు సమాజంలో మార్పు తెచ్చే శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## జలధార-జలహారతి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ శ్రీ ఏ. శ్యాంప్రసాద్

**పుట్టపర్తి కలెక్టరేట్, కదిలించే వార్త, ఏప్రిల్ 10 :**



కలెక్టరేట్ లోని వీడియో కన్ఫారెన్స్ హాలు నందు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లి'జలధార-జలహారతి'లి కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ శ్రీ ఏ. శ్యాంప్రసాద్ గారు శుక్రవారం జిల్లా మరియు మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని చెరువులు, కాలువలను త్వరితగతిన బాగు చేయాలి. ప్రతి చెరువులోకి నీరు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఈ ప్రక్రియలో అధికారులు 'జలధార-జలహారతి' మొబైల్ యాప్‌ను వినియోగించాలని సూచించారు. నిర్దేశించిన టార్గెట్ మేరకు ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డిడబ్ల్యుఎంఏ పిడి విజయేంద్ర ప్రసాద్, నీటిపారుదల అధికారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు ప్లే మెటీరియల్, కిట్ల పంపిణీ

**పుట్టపర్తి కలెక్టరేట్, కదిలించే వార్త, ఏప్రిల్ 10 :**
కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలు నందు పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా జిల్లా అభివృద్ధికి రూ. 20 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 395 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన ప్లే మెటీరియల్ (ఆట వస్తువుల) కిట్లను జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్ మరియు ఎమ్మెల్యే పల్లె సింధుర రెడ్డి శనివారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల మేధో వికాసానికి, శారీరక ఎదుగుదలకు ఈ ఆట వస్తువులు ఎంతో దోహదపడతాయి.హబ్ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ కిట్లను పంపిణీ చేయడం జరుగుతుంది.ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించి, పిల్లలు సురక్షితంగా ఆడుకునేలా నాణ్యమైన వస్తువులను అందించడంపై అవగాహన కల్పించాలి.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ప్రమీల , డిసిపిఓ మహేష్, నోడల్ ఆఫీసర్ వి. గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

